**జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు కావలెను**




మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, న్యూస్ పోర్టల్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి జిల్లాల వారీగా గతంలో ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో జిల్లా స్థాయిలో పని చేసిన అనుభవం ఉన్న రిపోర్టర్లు కావలెను.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్
PRGI REG. No. : TGTEL/25/A0540

Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

email: jobs@manasarkar.com

సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:240 | హైదరాబాద్ 02 ఏప్రిల్ 2026, గురువారం | పేజీలు: 8, వెల: రూ. 5/-
Vol-01 ::: Issue-240 | Hyderabad 02 April 2026, Thursday | Pages: 8, Rs. 5/-

MAKK FINSOL

**ఇన్సూరెన్స్ అడ్వైజర్స్ కావలెను**




ప్రముఖ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ కంపెనీకి లైఫ్, హెల్త్, జనరల్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్న అడ్వైజర్లు / ఏజెంట్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.

వివరాలకు : 91333 73937, makkfinsol@gmail.com



నేడు రాజ్యసభకు బిల్లు



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. లోక్‌సభలో 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026' కు బుధవారం ఆమోదం లభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై సుదీర్ఘ చర్చ తర్వాత ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆమోద ముద్ర వేశారు. దీంతో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న రాజధాని సందిగ్ధతకు చట్టపరమైన పరిష్కారం లభించినట్లయింది.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## చదరపు అడుగుకు
# రూ.14 వేలా?



**అమరావతి ప్రాజెక్టు పేరుతో దేశంలోనే అతిపెద్ద కుంభకోణం**

**అప్పుల ఊబిలో ఆగిపోయిన సంక్షేమం**

**MAVIGUN (మావిగన్) ప్రతిపాదనను ఎందుకు పట్టించుకోలేదు?**


**మేము ఏ ప్రాంతానికీ వ్యతిరేకం కాదు**

**రాజ్యాంగంలో 'రాజధాని' అనే పదం లేదు, కేవలం 'సీట్స్ ఆఫ్ గవర్నెన్స్' మాత్రమే ఉంది**

అమరావతి రాజధాని పనుల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల సొమ్మును విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తోందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచేసి వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారని మండిపడ్డారు. పక్కనే ఉన్న హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల కంటే అమరావతిలో చదరపు అడుగు ధరను రెట్టింపు చేసి చూపించడం వెనుక పెద్ద కుట్ర ఉందని ఆయన విమర్శించారు.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## అమెరికా ఖర్చు రోజుకు
# రూ. 8,455 కోట్లు




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఇరాన్‌పై అమెరికా సాగిస్తున్న యుద్ధం అగ్రరాజ్య ఖజానాను ఖాళీ చేస్తోంది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించిన ప్రకారం తాజా గణాంకాలతో నివ్వెరపోయేలా నివేదిక ప్రకటించింది. యుద్ధం ప్రారంభమై 31 రోజులు గడుస్తున్న తరుణంలో, అమెరికా ప్రతి సెకనుకు సుమారు $10,300 (రూ. 9.8 లక్షలు) ఖర్చు చేస్తోంది. కనురెప్ప వేసి తీసేలోపు పది లక్షల రూపాయల అమెరికా పౌరుల పన్ను సొమ్ము బూడిదలో పోసిన పన్నీరవుతోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో సాగుతున్న ఈ సైనిక చర్య ఆర్థికంగా పెను భారంగా మారుతోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ యుద్ధం నేటికి ఒక నెల పూర్తి చేసుకుంది.

...::: తరువాయి 2వ పేజీలో...

## అరవింద్ కేజ్రీవాల్ కు
# ఢిల్లీ హైకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఎక్సైజ్ పాలసీ మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు ఢిల్లీ హైకోర్టు బుధవారం నోటీసులు పంపింది. ఎక్సైజ్ పాలసీ కేసులో సమన్లు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్ హాజరుకాలేదంటూ ఈడీ నమోదు చేసింది. రెండు వేర్వేరు కేసుల్లో ఆయనను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఈడీ పిటిషన్‌పై విచారణ జరిపింది. కేజ్రీవాల్‌కు ముందుగానే నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన ఉద్దేశపూర్వకంగానే విచారణకు హాజరుకాలేదని ఈడీ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కేజ్రీవాల్‌ను నిర్దోషిగా ప్రకటించి ట్రయల్ కోర్టు తప్పిదం చేసిందన్నారు. ఈడీ వాదనలు విన్న ధర్మాసనం కేజ్రీవాల్‌కు తాజాగా నోటీసులు జారీ చేసింది. ఈనెల 29వ తేదీకి కేసును వాయిదా వేసింది. అంతకుముందు, మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌పై విచారణ కొనసాగించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ ఆయనను నిర్దోషిగా ప్రకటించారు. ఈ తీర్పునే ఇప్పుడు ఈడీ హైకోర్టులో సవాలు చేసింది.



# ఇంచు కూడా కదిలించలేరు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి లోక్‌సభలో చట్టబద్ధత లభించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరు పర్యటనలో ఉన్న ఆయన, ఈ చారిత్రాత్మక పరిణామంపై స్పందిస్తూ ప్రతిపక్ష వైసీపీపై బుధవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇకపై అమరావతిని ఇంచు కూడా కదిలించే శక్తి ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను అరాచక, విధ్వంస పాలనగా అభివర్ణించిన చంద్రబాబు, వైసీపీది కేవలం మూడు ముక్కలాట అని, మూడు రాజధానుల నినాదమని మండిపడ్డారు. ఆంధ్రుల సంకల్పమైన అమరావతిని ముంపు ప్రాంతమని,

...::: తరువాయి 2వ పేజీలో...

# ఇరాక్‌లో జర్నలిస్ట్ కిడ్నాప్



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఇరాక్‌అమెరికా ఉద్రిక్తతల క్రమంలో బాగ్దాద్ నడిబొడ్డున ఒక అమెరికన్ మహిళా జర్నలిస్ట్ కిడ్నాప్ సంచలనంగా మారింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షెల్లీ కిటెల్సన్‌ను గుర్తు తెలియని దుండగులు అందరూ చూస్తుండగానే అపహరించడం, దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అగ్రరాజ్యం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. బాగ్దాద్‌లోని ఒక హోటల్ వెలుపల ఉన్న షెల్లీ కిటెల్సన్‌ను దుండగులు కారులో ఎక్కించుకుని వెళ్తున్న దృశ్యాలను స్థానికులు వీడియో తీశారు. ఈ ఘటనను ఇరాక్ అంతర్గత మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. జర్నలిస్ట్ ఆచూకీ కోసం ఇరాక్ పోలీసులు విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కిడ్నాప్ వెనుక ఇరాన్ అనుకూల ఉగ్రవాద సంస్థ 'కతైబ్ హెజ్బొల్లా' హస్తం ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ అనుమానిస్తోంది. ఈ క్రమంలోనే ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. షెల్లీ కిటెల్సన్ పశ్చిమాసియా ఘర్షణలను కవర్ చేయడంలో అత్యంత ధైర్యవంతురాలని, ఆమె భద్రత పట్ల తీవ్ర ఆందోళనగా ఉందని అంతర్జాతీయ మహిళా మీడియా ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎలీసా లీస్ మునోజ్ విచారం వ్యక్తం చేశారు. ఖతార్‌కు చెందిన అల్ జజీరా మీడియా కూడా ఈ కిడ్నాప్ వీడియోను ప్రసారం చేయడంతో ఈ అంశంపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.




## హెచ్‌సీఏలో
# రూ.600 కోట్ల కుంభకోణం?

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాలకు నిలయంగా మారిందని, గత 20 ఏళ్లుగా అక్కడ నిధుల దుర్వినియోగం యథేచ్ఛగా సాగుతోందని టీసీఏ కార్యదర్శి గురువారెడ్డి ధ్వజమెత్తారు. ఇప్పటివరకు దాదాపు రూ. 600 కోట్లకు పైగా నిధులు దారిమళ్లాయని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ. 69 కోట్లు బదిలీ చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. క్రికెట్ అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను కొందరు వ్యక్తులు స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. అసోసియేషన్‌లో సాగుతున్న క్లబ్ రాజకీయాలపై కూడా గురువారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఆస్తులైన క్లబ్బులను ప్రైవేటు వ్యక్తులకు అక్రమంగా బదిలీ చేశారని, అసలైన క్లబ్బుల ఉనికిని మాయం చేసి నకిలీ క్లబ్బులతో ఓటరు జాబితాను తారుమారు చేశారని ఆరోపించారు. దీనివల్ల అర్హులైన వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ఐపీఎల్ టికెట్ల బ్లాక్ మార్కెట్ దందాను తక్షణమే అరికట్టాలని, ఈ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విన్నవించారు.

## అస్సాంలో బీజేపీకి
# హ్యాట్రిక్ తథ్యం



**అస్సాం (ఏడీఎన్ఎన్) :**

బీజేపీకి అస్సాం ప్రజలు మళ్లీ పట్టం కడతారని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రం గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. గోగముఖ్‌లో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే అభివృద్ధి, సుస్థిరతకే పట్టంకట్టనున్నట్టు చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## తమిళనాడులో
# ఎన్డీయే వస్తే ప్రమాదమే!



**చెన్నై (ఏడీఎన్ఎన్):**

తమిళనాడులో డీఎంకే తిరిగి అధికారంలోకి రావడం చాలా అవసరమని ఆ రాష్ట్ర సీఎం, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ కూటమిని చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.ఉత్తర్‌ప్రదేశ్, మణిపూర్ తరహాలో తమిళనాడులో అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ పార్టీ కుట్ర పన్నిందని సీఎం స్టాలిన్ ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కనిపించే ఘర్షణలు, మూకదాడులు తమిళనాడులో లేవన్నారు. కూటమి పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. ఎన్డీయే అధికారంలోకి వస్తే తమిళనాడు పేరును 'దక్షిణ ప్రదేశ్'గా మార్చేస్తుందని ఓటర్లను హెచ్చరించారు. తిరుచ్చి జిల్లా నుంచి ఎన్నికల ప్రచారాన్ని స్టాలిన్ బుధవారం ప్రారంభించారు. సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ తరపున పోటీ చేస్తున్న 9 మంది అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం సాగించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## విమానం కూలి
# 29 మంది మృతి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

క్రిమియా ద్వీపకల్పంలో జరిగిన భారీ విమాన ప్రమాదం రష్యాకు విషాదాన్ని మిగిల్చింది. రష్యాకు చెందిన ఏఎన్26 సైనిక రవాణా విమానం బుధవారం తెల్లవారుజామున కూలిపోవడంతో, అందులో ప్రయాణిస్తున్న మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు విమాన సిబ్బందితో పాటు 23 మంది సైనిక ప్రయాణికులు ఉన్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ ప్రమాదం క్రిమియాలోని ఒక కొండ అంచును ఢీకొట్టడం వల్ల సంభవించింది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో రేడార్‌తో సంబంధాలు కోల్పోయిన ఈ విమానం, తర్వాత కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ఘటనలో శత్రు దేశాల దాడుల ఆనవాళ్లు ఏవీ లేవని, సాంకేతిక లోపం లేదా పైలట్ తప్పిదం వల్లనే విమానం కొండను ఢీకొట్టి ఉంటుందని రష్యా దర్యాప్తు కమిటీ భావిస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీశాయి.

...::: తరువాయి 2వ పేజీలో...

## కాళేశ్వరం గొప్పతనానికి
# ఈ జలధారలే సాక్ష్యం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై అవాకులు చెవాకులు పేలుతున్న వారికి మండుటెండల్లోనూ కాలువల్లో గలగలా పారుతున్న నీళ్లే సజీవ సాక్ష్యమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు . లక్షల కోట్లు వృథా అంటూ విమర్శలు చేసే కళ్లులేని కబోదులకు, ఎండకాలంలోనూ పొలాలకు మళ్లుతున్న ఈ జలధారలే నిలువెత్తు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం జలాలు రాష్ట్రానికి ఎంతటి వరప్రదాయినిగా మారాయో ప్రస్తుత పరిస్థితులే చెబుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యంగా మల్లన్న సాగర్ నుంచి సిద్ధిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు కాలువల ద్వారా గోదావరి జలాలు నిరంతరాయంగా ప్రవహిస్తున్నాయని హరీశ్ రావు తెలిపారు. ఈ వేసవిలోనూ సాగునీటి కొరత లేకుండా పంటలు పండుతున్నాయంటే అది కేసీఆర్ విజన్ , కాళేశ్వరం ప్రాజెక్టు ఘనతేనని కొనియాడారు. విమర్శలు చేసే వారు వాస్తవాలను గ్రహించాలని, కాలువల్లో ప్రవహిస్తున్న గోదావరి ధారలే వారికి చెంపపెట్టు అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.



# కాళేశ్వరంపై కేంద్రం ద్వంద్వ నీతి...

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాజకీయ ప్రయోజనాల కోసం కాళేశ్వరాన్ని 'వృథా' అని విమర్శించవచ్చని, కానీ తెలంగాణకు మాత్రం ఈ ప్రాజెక్టు అద్భుతమైన విజయమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'ఎకనామిక్ సర్వే 2025-26' నివేదికలోని ముఖ్యాంశాలను కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా బుధవారం పంచుకున్నారు.కేంద్ర నివేదిక ప్రకారం, 2014లో తెలంగాణలో 1.31 కోట్లుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ కాకతీయ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్లే కేవలం దశాబ్ద కాలంలో సాగు భూమి రెట్టింపు అయిందని ఎకనామిక్ సర్వే స్పష్టంగా పేర్కొందని కేటీఆర్ గుర్తుచేశారు. రాష్ట్రంలో వరి దిగుబడి ఆకాశాన్నంటడానికి, భూగర్భ జల మట్టాలు పెరగడానికి కాళేశ్వరమే ప్రధాన కారణమని ఆయన వివరించారు. కాళేశ్వరం వల్ల తెలంగాణ సాధించిన ప్రగతిని వివరించేందుకు తన వద్ద వందలాది ఆధారాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టును ఒకసారి స్వయంగా సందర్శించి, తెలంగాణ ముఖచిత్రాన్ని అది ఎలా మార్చిందో కళ్లారా చూడాలని కేంద్ర మంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
02.04.2026
www.manasarkar.com

# కేంద్రమంత్రి సురేష్ గోపికి హైకోర్టులో చుక్కెదురు



**తిరువనంతపురం (ఏడీఎన్ఎన్):**

మలయాళ నటుడు కేంద్రమంత్రి సురేష్ గోపికి హైకోర్టులో చుక్కెదురు తగిలింది. కేరళ హైకోర్టులో తనపై నమోదైన పిటిషన్ ను కొట్టివేయాలని సురేష్ గోపి చేసిన అభ్యర్థనను బుధవారం హైకోర్టు కొట్టివేసింది. జస్టిస్ కౌసర్ ఎడప్పగాత్ ఆయన పిటిషన్ ను తిరస్కరించారు. ఈ విషయంలో హైకోర్టులో ట్రయల్ ఎదుర్కోవలసిందేనన్నారు. ఆల్ ఇండియా యూత్, ఫెడరేషన్ నాయకుడు, త్రిస్సూర్ స్థానికుడు ఏఎస్ బినోయ్ కేంద్ర పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్, టూరిజం మంత్రి సురేష్ గోపిపై పిటిషన్ వేశారు. లోక్ సభ ఎన్నికల్లో సురేష్ గోపి అక్రమాలకు పాల్పడినట్టు తన పిటిషన్ లో పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి గెలిచారన్నారు. గెలుపుకోసం అడ్డదారులు తొక్కారని ఫిర్యాదు చేశాడు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మతాన్ని వాడుకున్నట్లు ఆరోపించారు. ఆయన ఎంపీ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని పిటిషన్ లో ఏస్ బినోయ్ కోరారు. కేరళ రాష్ట్రంలో 70 ఏళ్ల రాజకీయ చరిత్రలో బీజేపీ నుంచి గెలిచి సురేష్ గోపి చరిత్రను తిరగరాశారు. త్రిస్సూర్ లోక్ సభ స్థానం నుంచి 74,686 ఓట్ల మెజారిటీతో బీజేపీ నుంచి గెలిచారు. ఇందుకుగాను ఆయనకు కేబినెట్ లో చోటు ఇచ్చారు

# అమెరికా ఖర్చు రోజుకు రూ. 8,455 కోట్లు

**మొదటిపేజీ తరువాయి...**

ఈ స్వల్ప కాలంలోనే అమెరికా సుమారు $27.68 బిలియన్లు (రూ. 2.63 లక్షల కోట్లు) వెచ్చించింది. సగటున రోజుకు 890 మిలియన్ డాలర్లు (రూ. 8,455 కోట్లు) ఖర్చు అవుతోంది. ఈ భారీ వ్యయంలో సింహభాగం అంటే 36 శాతం ($320 మిలియన్లు) టోమాహాక్ క్రూయిజ్ క్షిపణులు , బాంబుల కోసమే వెచ్చిస్తున్నారు. గగనతల దాడులు, యుద్ధ విమానాల ఇంధనం కోసం రోజుకు $245 మిలియన్లు, సముద్రంలో మోహరించిన క్యారియర్ స్ట్రైక్ గ్రూపుల నిర్వహణకు $155 మిలియన్లు ఖర్చవుతోంది. ఇరాన్ ప్రయోగించే డ్రోన్లు, క్షిపణులను అడ్డుకునే థాడ్ , పేట్రియాట్ వంటి రక్షణ వ్యవస్థల కోసం రోజుకు మరో $95 మిలియన్లు ఖజానా నుంచి కదులుతున్నాయి. ఇవి కాకుండా నిఘా, సైబర్ సెక్యూరిటీ , సైనికుల భత్యాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ విపరీతమైన ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ట్రంప్ ప్రభుత్వం ఒక పాత వ్యూహాన్ని తెరపైకి తెస్తోంది. 1990 గల్ఫ్ యుద్ధం సమయంలో మిత్రదేశాలు ఆర్థిక సాయం చేసినట్లుగానే, ధనిక అరబ్ దేశాలు ఈ యుద్ధ ఖర్చును భరించాలని ట్రంప్ డిమాండ్ చేసే అవకాశం ఉంది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ మాట్లాడుతూ, యుద్ధ ఖర్చులో ఇతర దేశాలను భాగస్వామ్యం చేయడంపై అధ్యక్షుడు ఆసక్తిగా ఉన్నారని సంకేతాలిచ్చారు. ఇరాన్ మాత్రం యుద్ధం వల్ల తమకు జరిగిన నష్టానికి అమెరికాయే పరిహారం చెల్లించాలని, అప్పుడే చర్చలకు వస్తామని భీష్మించుకు కూర్చుంది. మరోవైపు అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ నిరంతరాయంగా డ్రోన్ దాడులు చేస్తుండటంతో, ఈ వ్యయం రాబోయే రోజుల్లో ఆందోళనకర స్థాయికి చేరేలా కనిపిస్తోంది. యుద్ధం ముగింపు దశకు రాకపోగా, ఖర్చు అంకెలు మాత్రం సామాన్యుడి ఊహకు అందనంత ఎత్తుకు చేరుతున్నాయి.

# ఇంచు కూడా కదిలించలేరు

**మొదటిపేజీ తరువాయి...**

శ్మశానమని హేళన చేసిన వారికి ఈరోజు పార్లమెంట్ సాక్షిగా సరైన సమాధానం లభించిందని ఆయన వ్యాఖ్యానించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరుపై చంద్రబాబు ఈ సందర్భంగా ఘాటుగా స్పందించారు. కనీసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు కూడా రాలేని వ్యక్తిని తన జీవితంలో చూడలేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం 'స్వర్ణాంధ్ర @ 2047' విజన్‌తో ఆరు సూత్రాల పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ రంగంలో ఏపీని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ. 4,000 పెన్షన్ అందిస్తున్నామని, పేదల సంక్షేమమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ద్వారా రాజధానిపై ఉన్న అన్ని అనిశ్చితులు తొలగిపోయాయని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు వింజమూరు చేరుకున్న ముఖ్యమంత్రికి పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ పర్యటనలో మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొని ముఖ్యమంత్రికి మద్దతు తెలిపారు. రాష్ట్రం మళ్ళీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని, అమరావతి నిర్మాణం వేగంగా పూర్తి చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు.

# రెండు నెలలకు సరిపడా చమురు నిల్వలు




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు. అంతర్జాతీయ ధరల ట్రెండ్‌ను గురించి మాట్లాడుతూ రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని సుజాత శర్మ చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదన్నారు. 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని కూడా ఆమె తెలిపారు. ఇప్పటికీ అదే అమల్లో ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందన్నారు. తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా చర్యలు తీసుకుందని ఆమె తెలియజేశారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు శర్మ వెల్లడించారు.



# అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి ఎట్టకేలకు అత్యున్నత చట్టసభలో శాశ్వత గుర్తింపు లభించింది. ఏపీ పునర్విభజన చట్టసవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'అమరావతి చట్టబద్ధత బిల్లు'కు బుధవారం లోక్‌సభ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టగా, రెండు గంటల పాటు సాగిన ఉత్కంఠభరిత చర్చ తర్వాత బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది.

**అమరావతి అంధకారం నుంచి వెలుగులోకి:ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి**

విభజన ప్రక్రియ అరాచకంగా జరిగిందని ఆనాటి పరిస్థితులను పురందేశ్వరి గుర్తుచేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ ప్రస్థానం మొదలైనప్పుడు 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతి భవితవ్యాన్ని అంధకారంలోకి నెట్టిందని, త్యాగం చేసిన రైతులను అమానుషంగా వేధించిందని ఆమె మండిపడ్డారు. ఈ బిల్లుతో అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందన్న నమ్మకం కలిగిందని పేర్కొన్నారు.

**విభజన జరిగి పదేళ్లవుతున్నా రాజధాని లేకపోవడం దురదృష్టకరం:కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

అమరావతి అభివృద్ధికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన కిషన్ రెడ్డి, రెండు తెలుగు రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఏపీలో 8 విమానాశ్రయాలు ఉండగా తెలంగాణలో ఒకటే ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే తెలంగాణ విమానాశ్రయాల విషయంలో వెనుకబడిందని ఆయన అభిప్రాయపడ్డారు.

**అమరావతి ఒక ఉద్యమం.. కన్నీళ్లే ఈ చట్టానికి పునాది:కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్**

అమరావతి బిడ్డగా ఈ బిల్లుపై మాట్లాడటం తన అదృష్టమని పెమ్మసాని అన్నారు. వికేంద్రీకరణ పేరుతో జగన్ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని ధ్వజమెత్తారు. రాజధాని కోసం పోరాడిన మహిళా రైతులను మేకులు ఉన్న లాఠీలతో కొట్టించారని, వారి కన్నీళ్లే ఈ చట్టానికి పునాది అని భావోద్వేగంగా మాట్లాడారు. రాష్ట్ర రాజధాని విషయంలో ఉన్న అన్ని అనుమానాలకు ఈ చట్టసవరణ ముగింపు పలుకుతుందని ఆయన స్పష్టం చేశారు.

**రాజధాని రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం.. ఈ బిల్లు కేవలం డైవర్షన్:వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి**

వైసీపీ తరపున మాట్లాడిన మిథున్ రెడ్డి బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. అమరావతి పేరుతో ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో చదరపు గజానికి రూ. 4,000 ఖర్చు అవుతుంటే, అమరావతిలో రూ. 12,000 ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఇన్సైడర్ ట్రేడింగ్ కోసమే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారని, రాష్ట్రంలోని ఇతర సమస్యల నుంచి ప్రజలను పక్కదారి పట్టించడానికే ఈ బిల్లు తెచ్చారని విమర్శిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

**విశాఖను రాజధాని చేస్తే బాగుండేది:సమాజ్‌వాదీ పార్టీ ధర్మేంద్ర యాదవ్**

ఏపీలో ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖను రాజధానిగా చేసి ఉంటే ఇంత భూమి, అప్పులు అవసరం ఉండేది కాదని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడ్డారు. ల్యాండ్ పూలింగ్ వల్ల పెద్దలకే లాభం చేకూరుతుందని, రైతులకు దక్కిన పరిహారం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, బిహార్‌ను మోసం చేసినట్లు ఏపీని చేయవద్దని కేంద్రాన్ని కోరారు.

**ప్రత్యేక హోదా అంశం ఏమైంది?:శివసేన అర్వింద్ సావంత్**

విభజన సమయంలో ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేసిన టీడీపీ, ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉండి కూడా ఆ అంశాన్ని ఎందుకు ప్రస్తావించడం లేదని అర్వింద్ సావంత్ నిలదీశారు.

# చదరపు అడుగుకు రూ.14 వేలా?



**తాడేపల్లి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతి ప్రాజెక్టు పేరుతో దేశంలోనే అతి పెద్ద కుంభకోణం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాజధాని పేరుతో చంద్రబాబు పట్టపగలే దోపిడీ చేస్తున్నారని విమర్శించిన జగన్, కేవలం అసెంబ్లీ, సెక్రటేరియట్ టవర్లు, హైకోర్టు డిజైన్ల కోసమే రూ. 401 కోట్లు కేటాయించడంపై మండిపడ్డారు. గతంలో తమ హయాంలో విజయవాడ బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్‌కు కిలోమీటరుకు రూ. 35 కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు అమరావతిలో కిలోమీటరుకు రూ. 170 కోట్లు ఎందుకు పెంచుతున్నారని ఆయన నిలదీశారు. 2018లో పనులు చేసిన కంపెనీలకే మళ్ళీ టెండర్లు దక్కేలా గూడుపుఠాణీ జరిగిందని, ఇది కేవలం 'మాఫియా' దోపిడీ అని ధ్వజమెత్తారు. అమరావతిలో నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచేసి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. బెంగళూరు, హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో ఫైవ్ స్టార్ సదుపాయాలతో చదరపు అడుగుకు రూ. 4,500 దాటదని, కానీ అమరావతిలో రూ. 11 వేల నుంచి రూ. 14 వేలు చూపిస్తున్నారని మండిపడ్డారు. టవర్1 విలువను రూ. 932 కోట్ల నుంచి రూ. 1762 కోట్లకు, టవర్2 విలువను రూ. 762 కోట్ల నుంచి రూ. 1545 కోట్లకు పెంచారని.. జీఏడీ టవర్ పనులను రూ. 554 కోట్ల నుంచి ఏకంగా రూ. 1046 కోట్లకు పెంచేశారని వివరించారు. ఐదు టవర్లకు చదరపు అడుగుకు రూ. 14,795 ఖర్చు చేస్తున్నారని, ఇప్పటికే తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీకి రూ. 1100 కోట్లు వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి స్కాముల కోసం చేస్తున్న అప్పుల వల్ల రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కుంటుపడుతున్నాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై అప్పులు తెచ్చి కుమ్మరించడం వల్ల నాడునేడు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఆగిపోయాయని వెల్లడించారు. మరోవైపు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 36 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజ్యాంగంలో ఎక్కడా 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం 'సీట్స్ ఆఫ్ గవర్నెన్స్' మాత్రమే ఉంటుందని జగన్ గుర్తు చేశారు. అవినీతి నుంచి ప్రజల దృష్టిని మళ్ళించడానికే అసెంబ్లీలో అమరావతిపై తీర్మానం చేశారని, కౌన్సిల్‌లో తమ సభ్యులు అవినీతిని బయటపెడతారనే భయంతోనే అక్కడ చర్చ పెట్టలేదని ఆరోపించారు. రాష్ట్రంపై భారం పడకూడదనే తాము విశాఖపట్నాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా చేయాలని భావించినట్లు జగన్ స్పష్టం చేశారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో పోటీ పడాలంటే విశాఖపట్నం లాంటి అభివృద్ధి చెందిన నగరం అవసరమని, కేవలం రూ. 10 వేల కోట్లు పెడితే విశాఖ అద్భుతంగా తయారవుతుందని వివరించారు. అలాగే మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలిపి 'MAVIGUN' (మావిగన్) పేరుతో గ్రోత్ కారిడార్‌గా మార్చాలని తాము ఇచ్చిన సలహాను కూడా బాబు పట్టించుకోలేదని మండిపడ్డారు. లక్ష ఎకరాల అమరావతికి కనీసం రూ. 2 లక్షల కోట్లు అవసరమని, ఇది అసాధ్యమని తెలిసి కూడా కేవలం బినామీల భూముల రేట్ల కోసమే బాబు ఈ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. "మేము అమరావతి సహా ఏ ప్రాంతానికీ వ్యతిరేకం కాదు. కానీ చంద్రబాబు ఆచరణ సాధ్యం కాని హామీలతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు," అని జగన్ స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్ కుటుంబాలు ఇప్పటికీ ఎక్కడ ఉంటున్నాయని ప్రశ్నించిన ఆయన, ప్రజలను మభ్యపెట్టే బిల్డప్‌ల వల్ల రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందని హెచ్చరించారు. అమరావతి ప్రజల రాజధాని కాదని, ఇది స్కాముల రాజధాని అని ఆయన ఘాటుగా విమర్శించారు.

# అస్సాంలో బీజేపీకి హ్యాట్రిక్ తథ్యం

**మొదటిపేజీ తరువాయి...**

అస్సాం అసెంబ్లీ ఎన్నికలు వికసిత్ భారత్ నిర్మాణానికి జరుగుతున్న ఎన్నికలని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇది హ్యాట్రిక్ పరాజయం అవుతుందన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్‌కు వందోసారి ఓటమి ఖాయమని జోష్యం చెప్పారు. మూడోసారి ప్రధానిగా తాను హ్యాట్రిక్ సాధించానని మోదీ గుర్తు చేశారు. అలాగే అస్సాంలో కూడా హ్యాట్రిక్ విజయంతో ప్రజలు ఆశీర్వదిస్తారని ఆయన పేర్కొన్నారు. బీజేపీని గెలిపిస్తే అస్సాంలోని 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని ప్రధాని మోదీ అన్నారు. ఇల్లు రాని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలను కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య కల్పిస్తామన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడతామని తెలిపారు. ఉమ్మడి పౌర స్మృతి అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# తమిళనాడులో ఎన్డీయే వస్తే ప్రమాదమే!

**మొదటిపేజీ తరువాయి...**

రాజ్యసభలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను ఆమోదించడం ద్వారా మైనారిటీలు, శ్రీలంక తమిళులను అన్నాడీఎంకే, పీఎంకే వంచించాయని స్టాలిన్ విమర్శించారు. అప్పట్లో సీఏఏ ప్రభావం ఏ ఒక్కరిపై పడదని పళనిస్వామి సమర్థించారని, 2024 లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి మైనారిటీ ఓట్ల కోసం సీఏఏ ఒక చారిత్రక తప్పిదం అంటూ మాట మార్చారని స్టాలిన్ తెలిపారు. సీఏఏకి మీరు మద్దతిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? బహిరంగంగా దీనిపై సమాధానం ఇవ్వాలని పళనిస్వామిని సూటిగా ప్రశ్నించారు.డీఎంకే ఏడోసారి కూడా అధికారంలోకి వస్తుందని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ద్రవిడియన్ మోడల్ గవర్నమెంట్ కొనసాగుతుందన్నారు. ఎన్డీయే, ఆ కూటమి బానిసైన అన్నాడీంకే అధికారంలోకి వస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందని స్టాలిన్ అన్నారు. తమిళనాడు తమిళనాడులాగానే ఉండాలి కానీ, ఉత్తర్‌ప్రదేశ్, మణిపూర్ తరహాలో హింసాత్మకంగా మారకూడదన్నారు. ఇందుకోసం తమిళనాడు రాష్ట్రం మొత్తం ఒకటిగా నిలిచి బీజేపీఅన్నాడీఎంకే కూటమిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ద్రవిడయన్ మోడల్ ఇంజిన్ అనేది సూపర్‌ఫాస్ట్ ఇంజిన్ అన్నారు. బీజేపీ డబ్బా మోడల్ ఇంజిన్ అని దాని ముందు డీఎంకే తలవంచదని స్పష్టం చేశారు.

# మోదీ సమక్షంలో చమురు, ఇందన భద్రతపై కేబినెట్ భేటీ



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో దేశ ఇందన భద్రత, ఆర్థిక సుస్థిరతపై బుధవారం కేబినెట్ మీటింగ్ నిర్వహించారు. తన అధికారిక నివాసం అయిన 7 లోక్ కళ్యాణ్ మార్గ్ లో జరిగిన ఈ భేటీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా శీతారామన్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జయశంకర్ ఈ కీలక భేటీలో పాల్గొన్నారు. ఇరాన్ తో అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కొనసాగిస్తున్న యుద్ధ వాతావరణం వల్ల ఏర్పడ్డ చమురు సంక్షోభం, దేశంలో ప్రస్తుత చమురు నిల్వల పరిస్థితి, భవిష్యత్ ప్రణాళిక గురించి ఆయన కేంద్రమంత్రులతో చర్చించారు. చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా ఉండటానికి LPG మరియు LNG దిగుమతులను ఇతర దేశాల నుండి సేకరించడంపై చర్చించారు. యుద్ధ వాతావరణం వల్ల ధరలు పెరగకుండా చూడాలని, ముఖ్యంగా ఎరువులు, ఆహార ధాన్యాల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి కేంద్రమంత్రులను ఆదేశించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గులను గమనిస్తూ, దేశంలోని చమురు నిల్వలను సమర్థవంతంగా నిర్వహించడంపై సమీక్ష నిర్వహించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం వల్ల హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో రవాణాకు ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంది. భారత్ తన చమురు అవసరాల కోసం అధికంగా ఈ ప్రాంతంపైనే ఆధారపడటంతో, సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం ఈ 'హోల్ఆఫ్‌గవర్నమెంట్' విధానాన్ని అనుసరిస్తోంది. ప్రజలకు తప్పుడు సమాచారం చేరకుండా, ఎప్పటికప్పుడు వాస్తవాలను తెలియజేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. దీనివల్ల మార్కెట్‌లో అనవసర ఆందోళనలు, కృత్రిమ కొరత ఏర్పడకుండా నిరోధించవచ్చు.



# దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు

**తిరువనంతపురం (ఏడీఎన్ఎన్):**

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారత రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కేరళలో పర్యటించారు. పరవూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ , యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ దశాబ్దాలుగా అక్కడి ప్రజలను మోసం చేస్తున్నారని రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఇప్పటి వరకు కేరళలోని ప్రజలు ఎల్డీఎఫ్, యూడీఎఫ్ లలో ఏదో ఒక పార్టీకి ఓట్లు వేసి నిజాయితీగా గెలిపించుకున్నారు. కానీ ఆ రెండింటిలో ఏపార్టీ అధికారంలోకి వచ్చినా కేరళ ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అధికారంలో ఉన్న పార్టీ, ప్రతిపక్షంలో ఉన్న పార్టీ కలిసి ప్రజలను మభ్యపెట్టారని తెలిపారు. ఎల్డీఎఫ్ లో ఎల్ అనగా లూట్, డీ అనగా డివిజన్, ఎఫ్ అనగా ఫెయిల్యూర్ అని రాజ్ నాథ్ సింగ్ అర్థం చెప్పారు. అలాగే యూడీఎఫ్ అనగా అన్ ట్రస్టు వొర్తీ, డిస్ హానెస్ట్, ఫ్రాడ్ అని అని విడమర్చి తెలియజేశారు. సంక్షేమ పథకాల అమలులో రెండు పార్టీలు ఫెయిల్ అయ్యాయన్నారు. ఏప్రిల్ 9న జరగబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కేరళలో గ్యారంటీగా అడుగు పెడుతుందన్నారు.

# విమానం కూలి 29 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి...**

విమాన ప్రయాణ నిబంధనల ఉల్లంఘన జరిగిందా అనే కోణంలో రష్యా ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సోవియట్ కాలం నాటి ఈ ఏఎన్ 26 టర్బోప్రాప్ విమానాలను రష్యా దశాబ్దాలుగా రవాణా , పారాట్రూపర్ల తరలింపు కోసం వాడుతోంది. గత దశాబ్ద కాలంలో ఏఎన్26 విమానాలు వరుస ప్రమాదాలకు గురవ్వడం ఆందోళన కలిగిస్తోంది. 2020లో ఉక్రెయిన్ , దక్షిణ సూడాన్లలో జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. 2014లో ఉక్రెయిన్ నుంచి ఆక్రమించుకున్న క్రిమియా ప్రాంతంలో రష్యా సైనిక కదలికలు ఎక్కువగా ఉన్న తరుణంలో ఈ ప్రమాదం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. సాంకేతిక లోపాలతో పాతబడిపోతున్న విమానాల భద్రతపై రష్యా రక్షణ శాఖలో అంతర్గత చర్చలు మొదలయ్యాయి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రగాఢ సానుభూతి ప్రకటించగా, పూర్తి స్థాయి నివేదిక కోసం బ్లాక్ బాక్స్ డేటాను విశ్లేషిస్తున్నారు.



# చండీగఢ్ బీజేపీ ఆఫీస్ వద్ద పేలుడు కలకలం

**చండీగఢ్ (ఏడీఎన్ఎన్):**


చండీగఢ్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వెలుపల పార్కింగ్ స్థలంలో ఉన్న ఒక స్కూటీలో అకస్మాత్తుగా బుధవారం పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే సీనియర్ ఎస్పీ కన్వార్‌దీప్ కౌర్ నేతృత్వంలోని పోలీసు బృందం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చిన్నపాటి పేలుడు వస్తువును స్కూటీపైకి విసిరినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇది ఎవరో ఆకతాయిలు చేసిన పని అయి ఉండవచ్చని ఎస్పీ వెల్లడించినప్పటికీ, ఉగ్రకోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. ఘటనా స్థలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్న ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలను సేకరించాయి. ఈ ఘటన నేపథ్యంలో చండీగఢ్ నగరవ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ముఖ్యమైన కూడళ్లలో తనిఖీలు చేపట్టడంతో పాటు, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని సమాచారం.

# భారత్ లో జనగణన 2027 సంవత్సరంలోనే




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

దేశంలో జనగణనకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి తొలి దశ మొదలైంది. మొదటి దశలో భాగంగా గృహ గణన చేపట్టనున్నారు. ఈ సందర్భంగా 33 ప్రశ్నలను అడుగుతారని కేంద్రం తెలిపింది. ఇది దేశవ్యాప్తంగా జరిగే 16వ జనగణన కాగా, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇది 8వది. భారత రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ దీనిపై పలు విషయాలను వెల్లడించారు. జనగణనలో భాగంగా సేకరించే వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారని, ఏ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థతోనూ కేంద్రం పంచుకోదని ఆయన స్పష్టం చేశారు. ఈసారి జనాభా లెక్కలు రెండు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో గృహగణన, వ్యక్తిగత వివరాల నమోదు ప్రక్రియ ఉంటుంది. రెండో దశలో జనాభా గణన చేపడతారు. ఈ రెండవ దశలోనే కులాల గణన కూడా జరుగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. జనగణన 2027లో భాగంగా ప్రజలు తమ వివరాలను తామే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే 'సెల్ఫ్ఎన్యుమరేషన్' సౌకర్యం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 మధ్య 15 రోజుల పాటు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఒక్కో రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతానికి ఈ గడువు మారుతూ ఉంటుందన్నారు.



## టెక్ దిగ్గజాలకు ఇరాన్ 'డెడ్ లైన్'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా టెక్ దిగ్గజాలైన ఆపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, టెస్లా వంటి ప్రపంచ ప్రసిద్ధ అమెరికన్ కంపెనీల కార్యాలయాలపై దాడులు చేస్తామని ఇరాన్ 'డెడ్ లైన్' విధించింది. స్పష్టం చేసింది. ఈ దాడుల తీవ్రత దృష్ట్యా, సదరు కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు వెంటనే బయటకు రావాలని, కార్యాలయాలకు ఒక కిలోమీటరు పరిధిలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఈ నెల 1 నుంచే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని పేర్కొంటూ, తమ దేశంపై జరుగుతున్న ప్రతి ఉగ్రవాద చర్యకు ప్రతికారంగా ఈ కంపెనీల యూనిట్లను ధ్వంసం చేస్తామని హెచ్చరించింది. యుద్ధం కేవలం సైనిక స్థావరాలకే పరిమితం కాకుండా, అమెరికా బ్రాండ్లను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే ఇరాన్ అసలు వ్యూహంగా కనిపిస్తోంది. యుద్ధం భౌతిక సరిహద్దులు దాటి గ్లోబల్ కార్పొరేట్ సామ్రాజ్యాలపైకి మళ్లింది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే, ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఊహించని ప్రకటనతో ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అమెరికా ఆర్థిక , సాంకేతిక వెన్నెముకగా ఉన్న 18 ప్రముఖ టెక్ కంపెనీలను తమ తదుపరి లక్ష్యాలుగా ఇరాన్ ప్రకటించడంతో చర్చకు దారితీసింది అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన షరతులకు ఇరాన్ లొంగకపోతే "తీవ్ర సైనిక చర్య" తప్పదని ఆయన హెచ్చరించారు. గతంలో కువైట్ సమీపంలో కూలిపోయినట్లు భావించిన F15 యుద్ధ విమానాలు వాస్తవానికి టెహ్రాన్‌పై బాంబు దాడులు నిర్వహించాయని ఆయన సంచలన నిజాన్ని వెల్లడించడం ఉద్రిక్తతలను శిఖరాగ్రానికి చేర్చింది. ట్రంప్ బెదిరింపులకు దిగడమే కాకుండా, వాటిని అమలు చేయడంలో వెనకడుగు వేయరని హెగ్సెత్ స్పష్టం చేశారు. అమెరికాతో ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని ఇరాన్ ఎదురుదాడికి దిగింది. మధ్యవర్తుల ద్వారా అందుతున్న అమెరికా డిమాండ్లు "అసమంజసంగా" ఉన్నాయని, అసలు ఈ ఘర్షణను ప్రారంభించింది అమెరికాయేనని ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ పేర్కొన్నారు. టెక్ కంపెనీలపై ఇరాన్ హెచ్చరికలు అమెరికా స్టాక్ మార్కెట్‌ను గ్లోబల్ టెక్ రంగాన్ని తీవ్ర ఆందోళనలో నెట్టాయి.

## భారత సంతతి మహిళకు పదోన్నతి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



అమెరికాలో భారత సంతతి మహిళలు మరోసారి తమ సత్తా చాటుతున్నారు. అమెరికా కార్మిక శాఖ ముఖ్య సమాచార అధికారిగా భారత సంతతికి చెందిన ప్రముఖ సాంకేతిక నిపుణురాలు మంగళ కుప్పా నియమితులయ్యారు. గత ఏడాది అక్టోబరు నుంచి తాత్కాలిక సీఐవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమెను, పూర్తిస్థాయి అధికారిగా ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ నెల ప్రారంభంలోనే ఆమెను కార్మిక శాఖకు సంబంధించి 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అధికారిగా కూడా నియమించారు. టెక్నాలజీ రంగంలో 25 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉన్న మంగళ కుప్పా, 2010లో అమెరికా కార్మిక శాఖలో చేరారు. అప్పటి నుంచి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, బిజినెస్ అప్లికేషన్ సర్వీసెస్ డైరెక్టర్ వంటి ముఖ్య పదవుల్లో అద్భుతమైన పనితీరు కనబరిచారు. సీఐవోగా ఆమె కార్మిక శాఖలో సమాచార సాంకేతిక వ్యూహాలు, డిజిటల్ పరివర్తన , ఏఐ వినియోగాన్ని పర్యవేక్షించనున్నారు. సాంకేతికత ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడంలో ఆమె నియామకం ప్రధాన పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.




## మస్క్ స్టార్‌లింక్ కు వార్నింగ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థను తమ తదుపరి లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ విప్లవాత్మక గార్డ్ కార్ప్స్ హెచ్చరించింది. ఇరాన్ దాడుల వల్ల గల్ఫ్ దేశాల్లో తరచూ ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్ సమస్యలు తలెత్తుతుండటంతో, బహ్రెయిన్, కువైట్, యూఏఈ వంటి దేశాలు స్టార్‌లింక్ సేవలను ఆశ్రయిస్తున్నాయి. సదరు దేశాల్లోని స్టార్‌లింక్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లో ఈ నెట్‌వర్క్ వాడకంపై నిషేధం ఉండటమే కాకుండా, వినియోగదారులకు రెండేళ్ల జైలు శిక్షను టెహ్రాన్ ప్రభుత్వం ఒక ప్రకటన వెల్లడించింది. ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న సుమారు 18 అమెరికా టెక్ దిగ్గజాలపై దాడులు చేస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ జాబితాలో ఆపిల్, మైక్రోసాఫ్ట్, టెస్లా, ఇంటెల్, బోయింగ్, జేపీ మోర్గాన్ వంటి దిగ్గజ కంపెనీలు ఉన్నాయి. అమెరికాతో ఉద్రిక్తతలు పెరుగుతున్న కొద్దీ, అగ్రరాజ్య ఆర్థిక సాంకేతిక ప్రయోజనాలే లక్ష్యంగా ఇరాన్ తన వ్యూహాలను పదును పెడుతోంది.

## కదన రంగంలోకి సౌదీ, యూఏఈ సిద్ధం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



ఇరాన్ దూకుడును ఇన్నాళ్లూ ఓపికతో భరిస్తూ వచ్చిన గల్ఫ్ దిగ్గజాలు సౌదీ అరేబియా , యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నేరుగా యుద్ధ రంగంలోకి దూకేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ కూటమితో చేతులు కలిపి ఇరాన్ ఉక్కుపిడికిలి నుంచి హర్మూజ్ జలసంధిని విడిపించేందుకు ఈ దేశాలు వ్యూహరచన చేస్తున్నాయని 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ప్రచురించిన తాజా కథనం ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఇరాన్ దిగ్బంధం వల్ల హర్మూజ్ జలసంధి మూతపడటంతో గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతున్నాయి. పర్యాటకం, చమురు ఎగుమతులపై ఆధారపడిన యూఏఈకి కోలుకోలేని నష్టం వాటిల్లింది. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టేందుకు అమెరికాకు తన వైమానిక స్థావరాలను ఇచ్చేందుకు సౌదీ అరేబియా సూత్రప్రాయంగా అంగీకరించింది. గతంలో తటస్థంగా ఉన్న సౌదీ, హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు అమెరికా చేస్తున్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి పూర్తి మద్దతు ప్రకటించడం గమనార్హం. ఇరాన్‌తో నేరుగా తలపడిన మొదటి పర్షియన్ గల్ఫ్ దేశంగా యూఏఈ చరిత్రకెక్కనుంది. యూఏఈ దౌత్యవేత్తలు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ద్వారా ఇరాన్‌పై బలప్రయోగానికి అనుమతించే తీర్మానం కోసం రహస్యంగా పావులు కదుపుతున్నారు. ఐరోపా , ఆసియా దేశాలను ఒక కూటమిగా చేర్చి, అవసరమైతే సైనిక శక్తితో హర్మూజ్ తెరవాలని వారు గట్టిగా కోరుతున్నారు. గల్ఫ్ దేశాల అంతర్గత పరిస్థితులు కూడా ఇరాన్‌కు వ్యతిరేకంగా మారుతున్నాయి. ఇరాన్ ప్రయోగించిన సుమారు 2,500 క్షిపణులు , డ్రోన్ల వల్ల తమ మౌలిక సదుపాయాలు ధ్వంసం కావడంతో అక్కడి ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. టెహ్రాన్ ప్రభుత్వం పతనం అయ్యే వరకు యుద్ధం కొనసాగించాలని వారు కోరుకుంటున్నారు. దశాబ్దాలుగా ఇరాన్ ఆధీనంలో ఉన్న అబు మూసా వంటి వ్యూహాత్మక ద్వీపాలను ఆక్రమించుకోవాలని యూఏఈ అమెరికాకు సలహా ఇచ్చింది. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్ పౌరులు తమ దేశంలోకి రాకుండా యూఏఈ నిషేధం విధించింది (గోల్డెన్ వీసా ఉన్నవారికి మినహాయింపు). దీనివల్ల రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ఈ సైనిక చర్య అంత సులభం కాదని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఇప్పటికే గల్ఫ్ దేశాలను హెచ్చరిస్తూ, తమపై దాడులకు సహకరిస్తే పౌర విమానయాన కేంద్రాలు, చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేసింది. నిరంతర దాడుల వల్ల యూఏఈ పర్యాటక రంగం ఇప్పటికే స్తంభించిపోయింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలంటే సమీపంలోని భూభాగాలపై నియంత్రణ సాధించడం అత్యంత సంక్లిష్టమైన ప్రమాదకరమైన ఆపరేషన్ అని పెంటగాన్ అధికారులు భావిస్తున్నారు. సౌదీ ,యూఏఈల ఈ నిర్ణయం యుద్ధాన్ని మూడవ ప్రపంచ యుద్ధం దిశగా నెట్టే అవకాశం ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనం కాకుండా ఉండాలంటే హర్మూజ్ తెరవడం ఒక్కటే మార్గమని గల్ఫ్ దేశాలు బలంగా నమ్ముతున్నాయి.

## శ్వేతసౌధంలో రహస్య భూగర్భ కోట

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



ప్రపంచంలోనే అమెరికా అధ్యక్షుడి అధికారిక నివాసం 'వైట్‌హౌస్' ఒక భారీ సైనిక శక్తివంతమైన భవనంగా మారింది. ఇరాన్‌తో యుద్ధం తీవ్రతరమై, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వ్యక్తిగత భద్రత కోసం గతంలో లేని విధంగా ఆధునిక భూగర్భ బంకర్‌ను నిర్మిస్తున్నారు. చారిత్రక వైట్‌హౌస్ ప్రాంగణంలో సాగుతున్న ఈ రహస్య ప్రాజెక్ట్ అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. అగ్రరాజ్యంలో అంతర్గత రాజకీయాల్లో పెను దుమారానికి దారితీసింది. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తున్న సమయంలో ట్రంప్ స్వయంగా ఈ నిర్మాణ విశేషాలను వెల్లడించారు. వైట్‌హౌస్ ప్రాంగణంలో కొత్తగా నిర్మిస్తున్న భారీ 'బాల్‌రూమ్' కింద ఈ అత్యాధునిక భూగర్భ సముదాయం తయారవుతోంది. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వ ఖజానా నుంచి కాకుండా, ప్రైవేట్ సంస్థల నుంచి సేకరించిన నిధులను వాడుతుండటం గమనార్హం. ఈ కొత్త నిర్మాణంలో బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్, డ్రోన్ దాడులను తక్షణమే తిప్పికొట్టే 'యాంటీడ్రోన్' డిఫెన్స్ సిస్టమ్ వంటి లేటెస్ట్ టెక్నాలజీని ఏర్పాటు చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి పాత 'ప్రెసిడెన్షియల్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్' స్థానంలో, అన్ని రకాల అణు, రసాయనిక దాడులను తట్టుకునేలా ఈ కొత్త 'భూగర్భ కోట'ను అమెరికా సైన్యం యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తోంది. భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రముఖుల సమావేశాలకు, నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకార వేడుకలకు ఇది వేదిక కానుందని వైట్ హౌస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్టుపై అమెరికాలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ క్యాపిటల్ ప్లానింగ్ కమిషన్ నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే ఈ నిర్మాణం చేపట్టారని, దీనిపై అమెరికా కాంగ్రెస్ పర్యవేక్షణ కూడా లేదని మేధావులు మండిపడుతున్నారు. చారిత్రక కట్టడాల పరిరక్షణ సంస్థ 'నేషనల్ ట్రస్ట్ ఫర్ హిస్టోరిక్ ప్రిజర్వేషన్' ఈ ప్రాజెక్టును సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించింది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ ఈ అంశంపై స్పందిస్తూ, "సైన్యం అధ్యక్షుడి అభిరుచికి అనుగుణంగా కొన్ని ఆధునీకరణ పనులు చేస్తోంది" అని క్లుప్తంగా సమాధానమిచ్చారు. అమెరికా అధ్యక్షుడి చుట్టూ నిర్మిస్తున్న ఈ అభేద్యమైన రక్షణ కవచం వెనుక ఇంకా ఎన్ని రహస్యాలు ఉన్నాయోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అమెరికా రాజధాని వాషింగ్టన్ డి.సి.లోని '1600 పెన్సిల్వేనియా ఎవెన్యూ'లో ఉన్న వైట్‌హౌస్ ఒక భవనం మాత్రమే కాదు, అది అమెరికా ప్రజాస్వామ్యానికి చిహ్నం. ఐరిష్ వాస్తుశిల్పి జేమ్స్ హోబన్ డిజైన్ చేసిన ఈ భవన నిర్మాణం 1792లో ప్రారంభమై 1800లో పూర్తయింది. 234 ఏళ్ల చరిత్ర కలిగిన వైట్ హౌస్ అధికార కేంద్రం అమెరికా మొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ దీని నిర్మాణాన్ని పర్యవేక్షించినప్పటికీ, ఇందులో నివసించిన మొదటి అధ్యక్షుడు మాత్రం జాన్ ఆడమ్స్. 1814లో బ్రిటిష్ వారు ఈ భవనానికి నిప్పు పెట్టినప్పుడు, ఆ మచ్చలను కప్పిపుచ్చడానికి దీనికి వేసిన తెలుపు రంగు వల్లే దీనికి 'వైట్ హౌస్' అనే పేరు వచ్చింది. 1901లో అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ ఈ పేరును అధికారికంగా ఆమోదింపచేశారు.

**వైట్‌హౌస్ మూడు ముఖ్య భాగాలు :**

**ఎగ్జిక్యూటివ్ రెసిడెన్స్:** భవనం మధ్యలో ఉండే ఈ భాగంలోనే అధ్యక్షుడు తన కుటుంబంతో నివసిస్తారు.

**వెస్ట్ వింగ్:** అత్యంత కీలకమైన విభాగం. అధ్యక్షుడి అధికారిక కార్యాలయమైన 'ఓవల్ ఆఫీస్', క్యాబినెట్ రూమ్ ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే 'సిట్యుయేషన్ రూమ్' ఇక్కడే ఉంటాయి.

**ఈస్ట్ వింగ్:** ఇది సాధారణంగా అమెరికా ఫస్ట్ లేడీ ఆఫీస్‌గా పనిచేస్తుంది.

మొత్తం 132 గదులు, 35 బాత్‌రూమ్‌లు, 6 అంతస్తులు కలిగిన ఈ భవనంలో సినిమా థియేటర్, స్విమ్మింగ్ పూల్, బౌలింగ్ అల్లే వంటి సదుపాయాలు ఉన్నాయి. రాడార్లు, క్షిపణి నిరోధక వ్యవస్థలతో కూడిన అత్యంత కఠినమైన భద్రత మధ్య ఉండే ఈ భవనం, ట్రంప్ నిర్మిస్తున్న కొత్త బంకర్‌తో అభేద్యంగా మారనుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే ఈ భవన సందర్శన కోసం నెలల ముందే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా వైట్‌హౌస్ చుట్టూ ప్రస్తుతం 'హై అలర్ట్' ప్రకటించబడింది.

## చంద్రుడి చెంతకు చిన్నారి బొమ్మ



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అంతరిక్ష పరిశోధన చరిత్రలో మరో అద్భుత ఘట్టానికి నాసా శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల నుంచి వచ్చిన 2,000కు పైగా ఎంట్రీలను పరిశీలించిన , కాలిఫోర్నియాకు చెందిన ఒక ఎనిమిదేళ్ల బాలుడు రూపొందించిన ఈ బొమ్మను నాసా ఎంపిక చేసింది. ఐదు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత చంద్రుడిపైకి మానవుడిని పంపే ప్రతిష్టాత్మక 'అర్టెమిస్2' మిషన్‌లో ఒక వినూత్న ప్రయోగం చోటుచేసుకోనుంది. ఈ యాత్రలో నలుగురు వ్యోమగాములతో పాటు 'రైజ్' అనే ఒక చిన్న బొమ్మ నింగిలోకి ప్రయాణించనుంది. ఇది ఒక ఆటబొమ్మ మాత్రమే కాదు, అంతరిక్ష నౌకలో అత్యంత కీలకమైన 'జీరో గ్రావిటీ ఇండికేటర్'గా పనిచేయనుంది. అంతరిక్ష నౌక భూమి గురుత్వాకర్షణ శక్తిని దాటి శూన్య స్థితిలోకి ప్రవేశించిన వెంటనే, ఈ బొమ్మ గాలిలో తేలడం ప్రారంభిస్తుంది. తద్వారా తాము భారరహిత స్థితిలోకి చేరుకున్నామనే సంకేతాన్ని ఇది వ్యోమగాములకు అందిస్తుంది. 1961 నుంచి అంతరిక్ష యాత్రల్లో ఇటువంటి మస్కట్‌లను తీసుకెళ్లడం ఒక సంప్రదాయంగా వస్తోంది. గతంలో బేబీ యోడా, స్నూపీ వంటి బొమ్మలు అంతరిక్ష యానం చేసి చరిత్ర సృష్టించగా, 'రైజ్' ఆ జాబితాలో చేరనుంది. ఈ మిషన్‌లో ముగ్గురు అమెరికన్లు, ఒక కెనడా వ్యోమగామి పాల్గొంటున్నారు. వీరు చంద్రుడిపై కాలు మోపకుండా, జాబిల్లి చుట్టూ ప్రయాణించి రాకెట్ ,వ్యోమనౌక వ్యవస్థల పనితీరును పరీక్షిస్తారు. ఒక చిన్నారి మేధస్సు నుంచి పుట్టిన బొమ్మ విశ్వాంతరాళంలోకి వెళ్లడం శాస్త్రవేత్తలతో పాటు సామాన్యుల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది.



## ఇరాన్‌తో యుద్ధం మాకొద్దు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలను బేఖాతరు చేస్తూ, ఇరాన్‌తో యుద్ధంలోకి దిగే ప్రసక్తే లేదని యూకే ప్రధాని కీర్ స్టార్మర్ తేల్చిచెప్పారు. బ్రిటన్ ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఎవరి ఒత్తిడికీ తలొగ్గేది లేదని ఆయన బుధవారం స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు ప్రపంచ స్థాయి సదస్సును నిర్వహిస్తామని, అన్ని దౌత్య మార్గాలను పరిశీలిస్తామని స్టార్మర్ ప్రకటించారు. యుద్ధం ద్వారా సమస్యను పరిష్కరించడం తమ విధానం కాదని, "ఇది మా యుద్ధం కాదు" అని ఆయన కుండబద్దలు కొట్టారు. హర్మూజ్ విషయంలో తమ మాట వినని దేశాలకు అమెరికా రక్షణ సాయం నిలిపివేస్తుందన్న ట్రంప్ హెచ్చరికలపై స్పందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా కంటే తోటి ఐరోపా దేశాలతో బలమైన సంబంధాలు కలిగి ఉండడమే బ్రిటన్‌కు శ్రేయస్కరమని అభిప్రాయపడ్డారు. యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరిగి జీవన వ్యయం భారమైనప్పటికీ, ఆ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి బ్రిటన్ సిద్ధంగా ఉందన్నారు. బ్రిటన్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాకు కోలుకోలేని దౌత్యపరమైన దెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.



## హిజ్బుల్లా టాప్ కమాండర్ హతం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ వైమానిక దళం హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థపై మెరుపు దాడులు జరిపింది. ఈ దాడిలో హిజ్బుల్లా దక్షిణ విభాగానికి ప్రధాన వ్యూహకర్త, మాస్టర్‌మైండ్‌గా భావించే టాప్ కమాండర్ యూసుఫ్ ఇస్మాయిల్ హషీమ్ హతమయ్యాడు. ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన అనేక డ్రోన్ క్షిపణి దాడుల వెనుక ఇతనే ప్రధాన సూత్రధారి అని ఇజ్రాయెల్ రక్షణ దళం అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామం హిజ్బుల్లాలో ప్రకంపనలు సృష్టిస్తుండగా, మరోవైపు ఇరాన్ మద్దతు ఉన్న గ్రూపులు ప్రతీకార దాడులకు దిగుతున్నాయి. బహ్రెయిన్ తన వాయు రక్షణ వ్యవస్థ ద్వారా ఇరాన్ ప్రయోగించిన సుమారు 186 క్షిపణులు 419 డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించింది. ఇటు కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఏడోసారి దాడి జరగడం అంతర్జాతీయ విమానయాన రంగాన్ని ఆందోళనలో నెట్టింది. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌లో క్షిపణుల వర్షం కురవడంతో అనేక బహుళ అంతస్తుల భవనాలు కుప్పకూలాయి. ఈ భీకర పోరులో రెండు వైపులా సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో హర్మూజ్ జలసంధి మూసివేత భయాలు క్రూడ్ ఆయిల్ ధరలను ఆకాశానికి చేర్చాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగి సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతోంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఈ యుద్ధం ఇరాన్ పతనంతోనే ముగుస్తుందని సంచలన వ్యాఖ్యలు చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాత్రం అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని మొండిగా సమాధానమిచ్చారు. యుద్ధం నేపథ్యంలో అర్జెంటీనా ఇప్పటికే ఇరాన్ ఐఆర్‌జీసీని ఉగ్రవాద సంస్థగా ప్రకటించి షాక్ ఇవ్వగా, రష్యా మాత్రం భారత్ వంటి దేశాలకు అండగా నిలుస్తూ ఎవరి ఒత్తిడికీ తలొగ్గకుండా చమురు కొనుగోలు చేయవచ్చని మద్దతు తెలిపింది. రేపు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశాన్ని ఉద్దేశించి చేయనున్న ప్రసంగంపై ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. అది శాంతికి దారి తీస్తుందో లేక యుద్ధాన్ని ఉధృతం చేస్తుందో వేచి చూడాలి.




## 12 టన్నుల చాక్లెట్లు హాంఫట్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

హావ్ ఏ బ్రేక్ . . హావ్ ఏ కిట్‌క్యాట్" ఈ పాపులర్ ట్యాగ్‌లైన్‌ను ఎవరో దొంగలు మరీ సీరియస్‌గా తీసుకున్నట్లున్నారు. ఏకంగా 12 టన్నుల కిట్‌క్యాట్ చాక్లెట్లను లారీతో సహా లేపేసి నెస్లే సంస్థకు కోలుకోలేని షాక్ ఇచ్చారు. సరిగ్గా ఏప్రిల్ 1వ తేదీనే ఈ ఘటన వెలుగుచూడడంతో ఏదో 'ఏప్రిల్ ఫూల్స్' ప్రాంక్ అని అందరూ నవ్వుకున్నారు. సీన్ కట్ చేస్తే.. ఇది జోక్ కాదు, గత నెల 30న జరిగిన పక్కా ప్రణాళిక చోరీ అని నెస్లే స్వయంగా ప్రకటించడంతో ప్రపంచం నివ్వెరపోయింది. యూరప్‌లోని తయారీ కేంద్రం నుంచి పంపిణీ కేంద్రానికి వెళ్తున్న ఈ ట్రక్కు దారిలోనే అదృశ్యమైంది. అందులో సుమారు 4,13,793 కిట్ క్యాట్ బార్లు ఉన్నాయి. వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్లో కోట్లలో ఉంటుంది. ఈ చోరీపై నెస్లే ప్రతినిధి చమత్కరిస్తూ , "మేము కిట్‌క్యాట్‌తో బ్రేక్ తీసుకోమని చెబుతాం కానీ, దొంగలు ఏకంగా 12 టన్నుల సరుకుతో విరామం తీసుకుంటారని ఊహించలేదు" అని పేర్కొన్నప్పటికీ, అంతర్గతంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇది కేవలం పబ్లిసిటీ స్టంట్ కాదని, నిజంగానే భారీ ఎత్తున సరుకు చోరీకి గురైందని కంపెనీ అధికారికంగా స్పష్టం చేసింది. దొంగిలించబడిన ఈ చాక్లెట్లు బ్లాక్ మార్కెట్లోకి రాకుండా అడ్డుకునేందుకు నెస్లే "స్టోలెన్ కిట్‌క్యాట్ ట్రాకర్" పేరుతో ఒక వినూత్న డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించింది. వినియోగదారులు తాము కొన్న చాక్లెట్ వెనుక ఉన్న 8 అంకెల 'బ్యాచ్ కోడ్'ను ఇందులో ఎంటర్ చేయడం ద్వారా అది దొంగిలించబడిన సరుకో కాదో తెలుసుకోవచ్చు. రిటైలర్లు కూడా అనుమానాస్పదంగా తక్కువ ధరకు వచ్చే సరుకును గుర్తించి సమాచారం ఇవ్వాలని కంపెనీ కోరింది. సోషల్ మీడియాలో ఈ వార్త దావాగ్నిలా వ్యాపించడంతో నెటిజన్లు ఫన్నీ కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఒక యూజర్ "నేను ఈ చాక్లెట్లను వెతికి పెడితే నాకు రోజుకు 1000 డాలర్లతో పాటు ఒక బాక్స్ కిట్‌క్యాట్ ఉచితంగా ఇవ్వాలి" అని డిమాండ్ చేయగా, మరికొందరు ఏకంగా డొనాల్డ్ ట్రంప్‌ను ట్యాగ్ చేస్తూ "అధ్యక్షా.. ఇరాన్ యుద్ధం పక్కన పెట్టి ఈ భారీ చాక్లెట్ దొంగతనంపై దర్యాప్తు చేయండి" అంటూ సెటైర్లు వేస్తున్నారు. ప్రస్తుతం ఈ 12 టన్నుల చాక్లెట్లు ఏ దేశ సరిహద్దులు దాటాయో, దొంగలు వీటిని ఏం చేస్తారో అన్నది ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద 'స్వీట్ మిస్టరీ'గా మారింది.



## హర్మూజ్ ను తెరవండి...


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న 'మాగ్జిమం ప్రెషర్' వ్యూహం క్లైమాక్స్‌కు చేరుకుంది. ఒకవేళ ఈ నెల 6 తేదీ గడువులోగా షరతులకు లొంగకపోతే వాళ్లను శిలా యుగానికి పంపిస్తాం" అని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' పోస్ట్ లో ఇరాన్ నూతన అధ్యక్షుడిని గత పాలకుల కంటే తెలివైన వ్యక్తిగా అభివర్ణిస్తూనే, హెచ్చరికల తీవ్రతను పెంచారు. ప్రపంచ చమురు రవాణాకు వెన్నెముక వంటి 'హర్మూజ్ జలసంధి'ని తక్షణమే, ఎటువంటి ఆంక్షలు లేకుండా తెరిస్తే తప్ప దాడులు ఆపబోమని ఆయన తేల్చి చెప్పారు. ఈ నెల 6న, రాత్రి 8 గంటల వరకు గడువును స్పష్టం చేశారు. ఇరాన్ నూతన నాయకత్వం కాల్పుల విరమణ కోరుకుంటోందని వెల్లడించిన ట్రంప్, తనదైన శైలిలో అత్యంత కఠినమైన షరతును విధించారు. ప్రపంచ ముడిచమురు సరఫరాలో 20 శాతం హర్మూజ్ జలసంధి మీదుగానే సాగుతుంది. ఇరాన్ ఈ మార్గాన్ని మూసివేయడం వల్ల అంతర్జాతీయంగా ఇంధన ధరలు ఆకాశాన్ని తాకాయి. భారత్ వంటి దేశాలపై ఈ ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. భారత్‌కు రోజూ వచ్చే 5.5 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురులో దాదాపు 2 మిలియన్ బ్యారెళ్లు , 54 శాతం ఎల్ఎన్‌జీ దిగుమతులు ఈ జలసంధి నుంచే వస్తుంటాయి. ట్రంప్ పెట్టిన గడువు లోపు ఇరాన్ వెనక్కి తగ్గుతుందా లేదా అనేది గ్లోబల్ మార్కెట్లను శాసించనుంది.

## శత్రువులకు నో ఎంట్రీ...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

కాల్పుల విరమణకు ఇరాన్ ప్రతిపాదించిందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యాఖ్యానించారు. ఇరాన్ ఎలాంటి కాల్పుల విరమణ ప్రతిపాదన చేయలేదని తేల్చేశారు. ఇరాన్ ప్రతిపాదించిందని చెబుతున్న ఐదు సూత్రాల ప్రణాళిక కేవలం మీడియా ఊహాగానం మాత్రమే అన్నారు. దురాక్రమణదారుడికి శిక్ష పడి, ఇరాన్‌కు పూర్తి నష్టపరిహారం చెల్లించే వరకు యుద్ధం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ సీజ్ ఫైర్ అడుగుతున్నట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అబద్ధమని తేలిపోయింది.హర్మూజ్ జలసంధి విషయంలో ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ స్పందించింది. హర్మూజ్ జలసంధి తమ పూర్తి, నిర్ణయాత్మక నియంత్రణలోనే ఉందని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ స్పష్టం చేసింది. సముద్ర మార్గాన్ని తిరిగి తెరవడంపై డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హాస్యాస్పద ప్రదర్శనలు, ప్రతిపాదనలను తోసిపుచ్చుతున్నట్లు తెలిపింది. ప్రభుత్వ టీవీలో ప్రసారమైన ప్రకటనలో.. హర్మూజ్ జలసంధిలోని పరిస్థితి తమ నావికా దళాల దృఢంగా, ఆధిపత్యంగా నియంత్రణలో ఉందని, ఒత్తిడి లేదా చర్చల ద్వారా శత్రువులకు దానిని తెరవబోమని తెలిపింది. అమెరికా అధ్యక్షుడి హాస్యాస్పద ప్రదర్శనల ద్వారా హర్మూజ్ జలసంధిని ఈ దేశ శత్రువులకు తెరవబోమని ఇరాన్ వెల్లడించింది.






## అమరావతికి వ్యతిరేకం కాదు.. అవినీతికే అభ్యంతరం

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్సభలో ఆమోదం పొందిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత మల్లాది విష్ణు విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధానిగా అమరావతిని నిర్మించవద్దని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చెప్పలేదని, కేవలం అక్కడ జరుగుతున్న అవినీతిని మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. తమ పార్టీ అమరావతికి వ్యతిరేకమని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేవలం అక్కడ జరుగుతున్న దోపిడీని ప్రశ్నిస్తే, దానిని రాజధానికి వ్యతిరేకతగా చిత్రీకరించడం తగదని మండిపడ్డారు.రాష్ట్రంలో కేవలం అమరావతి ఒక్కటే ఉందా అని ప్రశ్నించిన మల్లాది విష్ణు, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పరిస్థితిపై కూటమి ప్రభుత్వం ఎందుకు చర్చించడం లేదని నిలదీశారు. అమరావతి పేరుతో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని, ప్రజల దృష్టిని మళ్లించడానికే ఈ బిల్లును తెరపైకి తెచ్చారని ఆరోపించారు. లోక్సభలో బిల్లును ప్రవేశపెట్టినప్పుడు వైసీపీ ఎంపీలు చర్చలో పాల్గొని, అనంతరం తమ నిరసనను తెలుపుతూ సభ నుంచి వాకౌట్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజధాని విషయంలో తమది వికేంద్రీకరణ విధానమేనని, అయితే ఏ ప్రాంత అభివృద్ధికి తాము అడ్డు కాదని ఆయన పునరుద్ఘాటించారు.మరోవైపు, లోక్సభ నుంచి వైసీపీ ఎంపీలు వాకౌట్ చేయడాన్ని కూటమి సభ్యులు తప్పుబట్టారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరైన వైసీపీ నేతలు, పార్లమెంటులో కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అమరావతి భవిష్యత్తుకు భరోసా కల్పించే చారిత్రాత్మక బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీ తన ద్వంద్వ నీతిని చాటుకుంటోందని విమర్శించారు. లోక్సభ ఆమోదం పొందిన ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానున్న తరుణంలో, రాజధాని నిర్మాణ వ్యయం మరియు పనుల పారదర్శకతపై వైసీపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని మల్లాది విష్ణు స్పష్టం చేశారు.

## ఏపీ ఎంపీలు మోదీ చేతిలో రబ్బర్ స్టాంపులు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్కాల్సిన విభజన హామీలు, ప్రత్యేక హోదాపై పార్లమెంట్ వేదికగా గళమెత్తిన కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్కు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుండి ఎన్నికైన ఎంపీల తీరుపై ఆమె సోషల్ మీడియా వేదికగా బుధవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా ఉన్న మాణిక్కం ఠాగూర్కు ఉన్నంత చిత్తశుద్ధి ఆంధ్రప్రదేశ్ ఎంపీలకు లేకపోవడం సిగ్గుచేటని షర్మిల విమర్శించారు. ఒక పక్క ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ఏపీ ప్రత్యేక హోదా గురించి అడుగుతుంటే, ఇక్కడ పుట్టిన ఒక్క ఎంపీ అయినా మద్దతుగా నిలబడకపోవడం తెలుగు గడ్డ చేసుకున్న దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని, పౌరుషాన్ని ప్రధాని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ఆమె మండిపడ్డారు.రాష్ట్ర ప్రయోజనాల కంటే ఎంపీలకు మోదీ మెప్పే ముఖ్యమైందని షర్మిల ఆరోపించారు.వేర్వేరు పార్టీల ముసుగులో ఉన్నప్పటికీ, వీరంతా బీజేపీకి బానిసలని, మోదీ చేతిలో కేవలం రబ్బర్ స్టాంపులని ఆమె అభివర్ణించారు.విభజన జరిగి 11 ఏళ్లు గడుస్తున్నా ప్రత్యేక హోదా గురించి అడిగే దమ్ము, సత్తా ఎవరికీ లేదని నిలదీశారు. రాజధాని నిర్మాణానికి కేంద్రం నేరుగా నిధులు ఇవ్వకుండా అప్పులు తెచ్చుకోమంటుంటే, ఆ విషయాన్ని ప్రశ్నించే ధైర్యం 25 మంది లోక్సభ, 11 మంది రాజ్యసభ ఎంపీలకు లేకపోవడం రాష్ట్ర దురదృష్టమని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి స్వలాభం చూసుకుంటున్న ఎంపీలు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు.విభజన హామీలు ఏపీ ప్రజలకు ఇచ్చిన రూ. 5 లక్షల కోట్ల విలువైన చెక్కు వంటివని, కానీ రాష్ట్ర ఎంపీలు దాన్ని ఎన్క్యాష్ చేసుకోలేక పోతున్నారని షర్మిల విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకే పరిమితం చేస్తున్నా, అమరావతికి కేంద్రం మొండి చేయి చూపుతున్నా ఎంపీలు మౌనం వహించడం శోచనీయమన్నారు. పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళం విప్పలేని వారు ప్రజాప్రతినిధులుగా కొనసాగే అర్హత కోల్పోయారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని షర్మిల హెచ్చరించారు.

## కార్పొరేషన్లలో పెరిగిన వార్డులు

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వార్డుల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పెరుగుతున్న జనాభా , ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పాలనా సౌలభ్యం కోసం ఈ వార్డుల పునర్విభజన ప్రక్రియను చేపట్టినట్లు అధికారిక నోటిఫికేషన్ వెలువడింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వార్డుల రూపురేఖలు మారిపోనున్నాయి.రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన విశాఖపట్నం లో వార్డుల సంఖ్య భారీగా పెరగనుంది. ప్రస్తుతం 98 వార్డులుగా ఉన్న జీవీఎంసీలో, కొత్త విభజన తర్వాత ఆ సంఖ్య 120కి చేరనుంది. దీనివల్ల రాష్ట్రంలోనే అత్యధిక వార్డులు కలిగిన కార్పొరేషన్గా విశాఖ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. విజయవాడ కార్పొరేషన్లో కూడా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇక్కడ ప్రస్తుతమున్న 64 వార్డులు 86 వార్డులుగా విస్తరించబోతున్నాయి. అదేవిధంగా గుంటూరులో 57 వార్డుల నుండి 76 వార్డులకు సంఖ్య పెరగనుంది.రాయలసీమ , కోస్తా ఆంధ్రలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా వార్డుల పెంపుదల స్పష్టంగా కనిపిస్తోంది. నెల్లూరులో 54 వార్డులు 72కి, కర్నూలులో 52 వార్డులు 68కి పెరిగాయి. తిరుపతి , కడప కార్పొరేషన్లలో వార్డుల సంఖ్య 50 నుండి 66కి పెరగగా, ఏలూరు, అనంతపురం, ఒంగోలు , విజయనగరం నగరాల్లో 50 వార్డులు కాస్తా 62 వార్డులుగా మారాయి. అలాగే చిత్తూరు , మచిలీపట్నం కార్పొరేషన్లలో వార్డుల సంఖ్య 50 నుండి 60కి చేరుకుంది.వార్డుల సంఖ్య పెరగడం వల్ల నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన , నిధుల వినియోగం మరింత సమర్థవంతంగా జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి వార్డులోనూ జనాభా నిష్పత్తి సమానంగా ఉండేలా చూడటమే ఈ పునర్విభజన ప్రధాన ఉద్దేశం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఈ కొత్త వార్డుల విభజన అమల్లోకి రానుంది, దీనికి అనుగుణంగానే అధికారులు ఓటర్ల జాబితా సవరణ , కొత్త వార్డుల సరిహద్దుల నిర్ణయ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు.

# ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం గెలుపు

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్సభలో ఆమోదం పొందడంపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయమని, రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఎక్స్ వేదికగా బుధవారం భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. "నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నా రాజధాని అమరావతి," అని ప్రతి ఆంధ్రా బిడ్డ గర్వంగా నినదించేలా దేశ పార్లమెంటు వేదిక కావడం గొప్ప విషయమని, కోట్లాది మంది ప్రజల చిరకాల ఆకాంక్ష నేటితో నెరవేరిందని ఆయన కొనియాడారు. రాజధానిపై గతంలో నెలకొన్న అనిశ్చితికి ఈ బిల్లుతో తెరపడిందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. "ఒకే రాష్ట్రం ఒకే రాజధాని," నినాదంతో, అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యంగా అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ గతంలో ఏపీ అసెంబ్లీ చేసిన తీర్మానానికి ఇప్పుడు పార్లమెంటరీ చట్టబద్ధత లభించిందని వివరించారు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి మరియు మద్దతుగా నిలిచిన అన్ని రాజకీయ పార్టీలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి రైతులు చేసిన సుదీర్ఘమైన, శాంతియుతమైన పోరాటానికి దక్కిన ఫలితమే ఈ విజయమని, ఇది ప్రజాస్వామ్య విజయమని ఆయన పేర్కొన్నారు.ఆంధ్రుల సంస్కృతి, చరిత్రకు చిహ్నమైన అమరావతిని రాష్ట్ర ఆత్మగౌరవ రాజధానిగా కేంద్ర ప్రభుత్వం నిలిపిందని లోకేశ్ తన సందేశంలో వెల్లడించారు. "జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి," అంటూ తన పోస్టును ముగించిన ఆయన, లోక్సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు వెళ్లనున్న తరుణంలో ఇప్పటికే ఢిల్లీ పర్యటనకు సిద్ధమయ్యారు. పార్లమెంటులో రాజధాని బిల్లు ఆమోదం పొందడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతుందని, రాష్ట్ర భవిష్యత్తుకు ఇది బలమైన పునాది అని కూటమి ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# అమరావతి ఆంధ్రుల సమిష్టి సంకల్పం

**న్యూఢిల్లీ(ఏడీఎన్ఎన్) :**

అమరావతి అనేది కేవలం ఒక రాజధాని మాత్రమే కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల కలలు, ఆశయాలు , సమిష్టి సంకల్పానికి ప్రతీక అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అభివర్ణించారు. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్సభ ఆమోదం తెలిపిన చారిత్రాత్మక సందర్భంపై ఆయన స్పందిస్తూ, ఇది ప్రతి తెలుగు వ్యక్తి గర్వించదగ్గ రోజని కొనియాడారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ విజయాన్ని అమరావతి ఉద్యమకారులకు అంకితం చేశారు.రైతులకు, నారీ శక్తికి అంకితం" లోక్సభలో ఏపీ పునర్విభజన చట్టం2014 సవరణ ద్వారా అమరావతిని అధికారికంగా ఆంధ్రప్రదేశ్ రాజధానిగా గుర్తించడం ఒక కీలక ఘట్టం," అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని అమరావతి కోసం భూములను త్యాగం చేసిన రైతులకు, ఏళ్ల తరబడి పోరాటంలో వెన్నెముకలా నిలిచిన నారీ శక్తికి ఆయన అంకితం చేశారు. అమరావతి కలను పరిరక్షించడం కోసం రైతులు, మహిళలు చేసిన దృఢమైన పోరాటమే ఈరోజు పార్లమెంటులో చట్టబద్ధతకు పునాది అని ఆయన కొనియాడారు.దేశమంతా ఏకాభిప్రాయంతో అమరావతి బిల్లుకు మద్దతు తెలుపుతున్న సమయంలో, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ ఓటింగ్లో పాల్గొనకపోవడంపై రామ్మోహన్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అత్యంత కీలకమైన ఈ బిల్లుపై వైసీపీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. విభజన రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాల్సింది పోయి, వాకౌట్ చేయడం సరికాదని హితవు పలికారు.ముందున్న ప్రయాణం ఎంతో ఆశాజనకంగా ఉండబోతుందని, అమరావతి నిర్మాణం మరింత వేగంగా సాగుతుందని కేంద్రమంత్రి ధీమా వ్యక్తం చేశారు. అమరావతి భవిష్యత్తులో దేశానికే ఒక శక్తివంతమైన ఆర్థిక కేంద్రంగా ఎదుగుతుందని, నగరాల అభివృద్ధికి ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



# 2028 ఆగస్టుకు రాజధాని పూర్తి

**నెల్లూరు(ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై గత ప్రభుత్వం చేసిన ప్రచారం,ప్రస్తుతం వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నెల్లూరులో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, అమరావతి నిర్మాణ పనులపై కీలక ప్రకటన చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2028 ఆగస్టు నాటికి అమరావతి నిర్మాణం మొత్తం పూర్తవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాజధాని బిల్లును ఆమోదించాల్సింది పోయి, ఖర్చు ఎంత అవుతుందని వైసీపీ నేతలు అడగటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. జగన్ ప్రజలను తప్పుదారి పట్టించేందుకే నోటికొచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారని ఆయన ఆరోపించారు.రాజధాని రైతులకు ప్లాట్లు ఎప్పుడిస్తారంటూ వైసీపీ చేస్తున్న విమర్శలను మంత్రి నారాయణ గణాంకాలతో తిప్పికొట్టారు. ఇప్పటికే 34,980 ఎకరాల్లో రైతులకు ప్లాట్లు అలాట్ చేశామని, కొన్ని సాంకేతిక సమస్యల వల్ల కేవలం 651 మందికి మాత్రమే ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని స్పష్టం చేశారు. ఆ పెండింగ్ ప్లాట్ల కేటాయింపు కూడా త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు. రైతులకు ఇచ్చిన ప్లాట్లను ఇప్పటికే వారి పేరు మీద రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. వాస్తవాలు ఇలా ఉంటే, ఏమీ తెలియని వారిలా వైసీపీ నేతలు ప్లాట్ల గురించి మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన వృథా ఖర్చులను మంత్రి ఈ సందర్భంగా ఎండగట్టారు. సర్వే రాళ్లపై తన బొమ్మలు వేయించుకునేందుకు జగన్ ఏకంగా రూ. 700 కోట్లు ఖర్చు చేశారని, అటువంటి వ్యక్తి ఇప్పుడు అమరావతి ఖర్చుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. రూ. 10 లక్షల కోట్ల అప్పు చేశారని వైకాపా నేతలు అంటున్నారని, కానీ గత అరాచక పాలన వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చేందుకు తాము కష్టపడుతున్నామని తెలిపారు. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' (MAVIGUN) అంశంపై కూడా ఆయన స్పందిస్తూ, అసలు ఆ పదం ఎందుకు వాడుతున్నారో కూడా ఎవరికీ అర్థం కావడం లేదని విమర్శించారు. అమరావతే ఏకైక రాజధాని అని చట్టసభలు నిర్ణయించాయని, దానిని ఎవరూ మార్చలేరని మంత్రి నారాయణ పునరుద్ఘాటించారు.

# నాపై దాడి వెనుక సూత్రధారి పీవీ సునీల్ కుమారే

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**

శ్రీరామనవమి పర్యటనలో ఆకివీడులో తనపై జరిగిన దాడి వెనుక లోతైన కుట్ర దాగి ఉందని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘర్షణలకు మాజీ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ ప్రధాన సూత్రధారి అని ఆయన బుధవారం పేర్కొనడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. తనను అంతం చేసేందుకే కొందరు పక్కా పథకం ప్రకారం కత్తులు, రాళ్లతో దాడికి దిగారని ఆయన ఆరోపించారు. ఆకివీడులో హింసను ప్రేరేపించడంలో ఇస్మాయిల్, రాజేష్ ఖన్నా, మీసాలరాజు అనే ముగ్గురు వ్యక్తులు క్షేత్రస్థాయిలో ఉండి కీలక పాత్ర పోషించారని ఆయన వెల్లడించారు. ఘర్షణలు జరుగుతున్న సమయంలో ఈ ముగ్గురు నిందితులు పీవీ సునీల్ కుమార్తో నిరంతరం ఫోన్లో సంభాషించినట్లు రఘురామ ఆరోపిస్తున్నారు.నిందితుల ఫోన్ కాల్ డేటా మరియు టెక్నికల్ ఆధారాలను విశ్లేషిస్తే ఈ కుట్రకు సంబంధించిన పూర్తి చిట్టా బయటపడుతుందని రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ముందు ఎవరూ తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఆకివీడు పెద్దపేటలోని పురాతన రామాలయాన్ని పునర్నిర్మించాలని తాను సంకల్పించగా, అదే స్థలంలో 'గొంతెమ్మ' దేవాలయం నిర్మించాలని కోరుతూ కొన్ని దళిత సంఘాలు నిరసనకు దిగడం ఈ వివాదానికి మూలమని ఆయన వివరించారు. రామనవమి రోజున తాను ఆలయ సందర్శనకు వెళ్లినప్పుడు రెండు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణలో తనను లక్ష్యంగా చేసుకుని రాళ్ల దాడి జరిగిందని రఘురామ ఆవేదన వ్యక్తం చేశారు.డిప్యూటీ స్పీకర్పై జరిగిన ఈ దాడి ఘటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. హోంమంత్రి వంగలపూడి అనిత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రఘురామ చేసిన తాజా ఆరోపణలు , సమర్పించిన ప్రాథమిక ఆధారాల నేపథ్యంలో, పోలీసులు ఇప్పుడు నిందితుల కాల్ డేటాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ దాడి వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, దీనికి ఆర్థికంగా సహకరించిన వారెవరు అనే కోణంలో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. త్వరలోనే ఈ కేసులో కీలక పురోగతి లభించే అవకాశం కనిపిస్తోంది.



# ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

**న్యూ ఢిల్లీ(ఏడీఎన్ఎన్):**



ఆంధ్రప్రదేశ్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆందోళనకరంగా పడిపోతోందని కేంద్ర విద్యాశాఖ రాజ్యసభ వేదికగా వెల్లడించిన వివరాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంతి చౌదరి ఈ కీలక గణాంకాలను సమర్పించారు. గడిచిన ఏడాది కాలంలోనే సుమారు లక్షన్నర మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థలకు దూరమయ్యారని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా స్పష్టం చేసింది. 1 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల నమోదును విశ్లేషించగా, ప్రభుత్వ బడుల్లో చదువుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందని నివేదిక పేర్కొంది.గణాంకాలను పరిశీలిస్తే, 2024 25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 36,43,083గా ఉండగా,202526 విద్యా సంవత్సరం నాటికి అది 34,93,449కి పడిపోయింది.అంటే కేవలం ఒకే ఏడాది వ్యవధిలో మొత్తం 1,49,634 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇంత భారీ స్థాయిలో డ్రాపౌట్లు నమోదు కావడం విద్యాశాఖ పనితీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. విద్యార్థులు ప్రభుత్వ బడులను వదిలి ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రైవేటు బాట పట్టడానికి ప్రస్తుత ప్రభుత్వ విధానపరమైన మార్పులే కారణమని విమర్శలు వస్తున్నాయి.ముఖ్యంగా చంద్రబాబు ప్రభుత్వం పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రాధాన్యతను తగ్గించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గతంలో ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ సిలబస్ను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వ పర్యవేక్షణ లోపించడం, మౌలిక సదుపాయాల కొరత వంటి కారణాలు విద్యార్థులను ప్రభుత్వ బడులకు దూరం చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టడం వల్ల విద్యార్థుల నమోదు పెరిగిందని గుర్తు చేశారు.అయితే ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాల వల్ల పేద విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం వెల్లడించిన ఈ గణాంకాల నేపథ్యంలో,రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మేల్కొని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, విద్యార్థుల డ్రాపౌట్లను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యా రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.



## కృష్ణపట్నం జలాల్లో తమిళ బోటు స్వాధీనం..

**నెల్లూరు(ఏడీఎన్ఎన్) :**

నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని కృష్ణపట్నం సముద్ర జలాల్లో అక్రమ చేపల వేటపై అధికారులు ఉక్కుపాదం మోపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏపీ జలాల్లోకి చొరబడి వేట సాగిస్తున్న తమిళనాడుకు చెందిన ఒక బోటును రాష్ట్ర ప్రభుత్వం బుధవారం స్వాధీనం చేసుకుంది. మత్స్య శాఖ, మెరైన్ పోలీసులు ,స్థానిక పోలీసులు సంయుక్తంగా ఈ గస్తీ నిర్వహించారు.గత కొంతకాలంగా తమిళనాడు మత్స్యకారులు ఏపీ సరిహద్దులు దాటి అక్రమంగా చేపల వేట సాగిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో హై స్పీడ్ బోటు ద్వారా బుధవారం రాత్రి అధికారులు సముద్రంలో ముమ్మరంగా గస్తీ నిర్వహించారు. అధికారుల రాకను గమనించిన సుమారు తొమ్మిది బోట్లు చీకట్లోకి పరారయ్యాయి. అయితే, ఒక బోటును మాత్రం అధికారులు చాకచక్యంగా పట్టుకోగలిగారు. స్వాధీనం చేసుకున్న బోటులో సుమారు రూ. 1.50 లక్షల విలువైన మత్స్య సంపద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ బోటుతో పాటు చేపలను కూడా స్వాధీనం చేసుకున్న అధికారులు, వాటిని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్కు తరలించారు. ఏపీ జలాల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించి వేట సాగించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ మెరుపు దాడుల్లో మత్స్యశాఖ ఉన్నతాధికారులు శాంతి, ఏడీ చాంద్ బాషా తో పాటు మెరైన్ , స్థానిక పోలీస్ శాఖలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు. సముద్రంలో అక్రమ వేటను అరికట్టేందుకు మున్ముందు కూడా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు , గస్తీ కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

## అరవిందబాబు తీరుపై అధిష్ఠానం ఆగ్రహం

**నరసరావుపేట(ఏడీఎన్ఎన్)**



నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు ఇటీవలి ప్రవర్తనపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం తీవ్రస్థాయిలో మండిపడింది. పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన అనుసరించిన తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, దీనిపై తక్షణమే వివరణ ఇవ్వాలని బుధవారం ఆదేశించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఫోన్ చేసినా ఎమ్మెల్యే స్పందించకపోవడంతో, చివరకు వ్యక్తిగతంగా వచ్చి లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండి అధికారులపై ఒత్తిడి తీసుకురావడం క్రమశిక్షణారాహిత్యమని పార్టీ భావిస్తోంది.ఈ వివాదం వెనుక ప్రధానంగా అధికారుల బదిలీలు , నియామకాల అంశాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే, తన కార్యాలయంలోని ఒక వ్యక్తికి అవుట్సోర్సింగ్లో ఉద్యోగం ఇవ్వాలని గంటసేపు రాద్ధాంతం చేశారు. తర్వాత ఎస్పీ కార్యాలయానికి చేరుకుని, తాను సూచించిన వ్యక్తిని జిల్లా పోలీసు సెల్ న్యాయ సలహాదారుగా ఎందుకు నియమించలేదని ఎస్పీ బి. కృష్ణారావుతో వాగ్వాదానికి దిగారు. ఆర్డర్ కాపీ చేతికి ఇచ్చే వరకు కదిలేది లేదంటూ ఏకంగా పది గంటల పాటు ఎస్పీ ఛాంబర్లోనే బైఠాయించడం సంచలనం సృష్టించింది.పరిస్థితి ముదురుతున్న క్రమంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠితో పాటు ఇతర నేతలు రంగంలోకి దిగి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఎమ్మెల్యే వెనక్కి తగ్గలేదు. చివరకు ఆయన ఛాంబర్లోని బాత్రూంలోకి వెళ్లి గొళ్లెం పెట్టుకోవడంతో, పోలీసులు డంబెల్స్తో తలుపులు పగలగొట్టి ఆయనను బయటకు తీసుకురావాల్సి వచ్చింది. మంత్రులు లోకేశ్, అనిత కార్యాలయాల నుంచి వచ్చిన ఫోన్లను కూడా ఆయన ఖాతరు చేయలేదు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే ఇలా పోలీస్ కార్యాలయంలో గంటల తరబడి నిరసన తెలపడం చర్చనీయాంశంగా మారడంతో, పార్టీ అధిష్ఠానం ఈ విషయాన్ని సీరియస్గా తీసుకుని వివరణ కోరింది.




## లైసెన్స్ లేని డ్రైవర్, కండిషన్ లేని బస్సు

**మార్కాపురం(ఏడీఎన్ఎన్) :**

మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి, బాధ్యులైన హరికృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ యజమాని హరికృష్ణారెడ్డి , డ్రైవర్ యువరాజ్ను అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని డీఎస్పీ నాగరాజు బుధవారం మీడియా సమావేశంలో వెల్లడిస్తూ, ప్రమాదానికి గల కారణాలను వివరించారు. ముఖ్యంగా యాజమాన్యం లాభాపేక్షతో వ్యవహరించి, అనుభవం , డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తిని డ్రైవర్గా నియమించుకోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని పోలీసులు గుర్తించారు. ఎక్కువ జీతం ఇవ్వాల్సి వస్తుందనే సాకుతో అర్హత లేని వ్యక్తికి బస్సును అప్పగించడం తీవ్ర నిర్లక్ష్యమని డీఎస్పీ పేర్కొన్నారు.అంతేకాకుండా, ప్రమాదానికి గురైన బస్సు పరిస్థితి కూడా ఏమాత్రం బాగోలేదని విచారణలో తేలింది. ఎనిమిది నెలల క్రితం సెకండ్ హ్యాండ్ బస్సును కొనుగోలు చేసిన యజమాని, వాహనం కండిషన్ సరిగా లేకపోయినా సర్వీసులు నడిపిస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ బస్సు వినుకొండ మీదుగా వెళ్లాల్సి ఉండగా, ప్రయాణంలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో జాతీయ రహదారి మీదుగా మార్కాపురం వైపునకు మార్గాన్ని మళ్లించారు. ఈ క్రమంలోనే రాయవరం వద్ద టిప్పర్ను ఢీకొనడంతో పెను ప్రమాదం సంభవించింది.ఈ ప్రమాద తీవ్రతకు బస్సు పూర్తిగా దగ్ధమవడంతో 14 మంది ప్రయాణికులు సజీవ దహనం కాగా, మరో 29 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కలిగిరికి వెళ్తున్న సమయంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికంగా కలకలం రేపింది. నిబంధనలను తుంగలో తొక్కి ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టిన ట్రావెల్స్ యాజమాన్యంపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.



# ఏపీకి చట్టబద్ధత.. తెలంగాణకు వివక్షా?

- కేంద్రం పై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో బిల్లును ఆమోదించడాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, ఇదే సమయంలో తెలంగాణ పట్ల కేంద్రం చూపుతున్న వివక్షను ఎండగట్టారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కీలక హామీలను అమలు చేయడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఒక రాష్ట్రానికి చట్టబద్ధత కల్పిస్తూ సానుకూలంగా స్పందిస్తున్న కేంద్రం, మరో రాష్ట్రం పట్ల వివక్ష చూపడం ఆందోళనకరమని పేర్కొన్నారు.తెలంగాణ అభివృద్ధికి అత్యంత కీలకమైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం (IIM) వంటి హామీలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని మంత్రి విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడంలోనూ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందించడంలోనూ కేంద్రం మాట తప్పిందని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, విభజన చట్టంలోని అన్ని అంశాలను తక్షణమే అమలు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఎక్సైజ్ శాఖకు రికార్డు స్థాయి ఆదాయం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :




తెలంగాణ రాష్ట్ర ఖజానాకు మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం సరికొత్త గరిష్టానికి చేరుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ ఏకంగా రూ.40,209 కోట్ల ఆదాయాన్ని ఆర్జించి రికార్డు సృష్టించింది. గత ఆర్థిక సంవత్సరంతో (రూ.37,487 కోట్లు) పోలిస్తే ఈ ఏడాది అదనంగా రూ.2,722 కోట్ల ఆదాయం సమకూరింది, ఇది సుమారు 7 శాతం వృద్ధిని సూచిస్తోంది. 2018-19లో రూ.20,859 కోట్లుగా ఉన్న ఆదాయం, కేవలం ఏడేళ్ల కాలంలోనే రెట్టింపు కావడం గమనార్హం.మద్యం విక్రయాల సరళిని పరిశీలిస్తే, ఈ ఏడాది 382.91 లక్షల కేసుల లిక్కర్, 387.34 లక్షల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి. మొత్తం ఏడాదిలో డిసెంబర్ నెలలో అత్యధికంగా రూ.5,051 కోట్ల విలువైన విక్రయాలు జరగడం విశేషం. కేవలం అమ్మకాలే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాల ద్వారా రూ.1,771 కోట్లు, 1,214 బార్ల ద్వారా రూ.549 కోట్ల రెంటల్ ఫీజు ఆదాయం ప్రభుత్వానికి లభించింది.వీటికి తోడు,కొత్త మద్యం షాపుల కోసం వచ్చిన 95,628 దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి అదనంగా రూ.2,869 కోట్లు సమకూరాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఎక్సైజ్ ఆదాయం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2015-16లో రూ.12,706 కోట్లుగా ఉన్న ఆదాయం, 2021-22 నాటికి రూ.30,783 కోట్లకు, ఇప్పుడు 2025-26 నాటికి రూ.40,200 కోట్లు దాటి సరికొత్త మైలురాయిని అధిగమించింది.

# బనకచర్ల కేటాయింపులలో తెలంగాణకు అన్యాయం

న్యూఢీల్లి(ఏడీఎన్ఎన్) :



లోక్‌సభలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా బనకచర్ల ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు కేటాయించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు . ఈ నిర్ణయం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాజకీయంగా మద్దతు ఇచ్చే ఉద్దేశంతోనే కేంద్రం ఈ భారీ కేటాయింపులకు అంగీకారం తెలిపిందని వంశీకృష్ణ విమర్శించారు.మౌలిక సదుపాయాల కల్పనలోనూ తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే దాదాపు 9 విమానాశ్రయాలు ఉన్నాయని గుర్తు చేస్తూ, కొత్త విమానాశ్రయాల కేటాయింపులో తెలంగాణను పూర్తిగా విస్మరించడం సరికాదని హితవు పలికారు. విభజన హామీలను గాలికొదిలేసి, రాజకీయ ప్రయోజనాల కోసం ఒక రాష్ట్రానికి కొమ్ముకాస్తూ తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని ఎంపీ వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.




# రూ.100 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

హైదరాబాద్ నగరం శివారులోని మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించి విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. శాస్త్రిపురంలోని హుడా లేఅవుట్‌కు చెందిన క్రీడా మైదానం స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. సుమారు 188 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం విలువ మార్కెట్ ధర ప్రకారం దాదాపు రూ.100 కోట్లు ఉంటుందని అంచనా.ఈ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ దశలో ఉన్న ఐదు జీ ప్లస్ 3 (G+3) అంతస్తుల భవనాలను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. గతంలోనే కబ్జాదారులకు జీహెచ్‌ఎంసీ అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ, నిర్మాణాలు కొనసాగించడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా విభాగం, భారీ బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను తొలగించి కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడింది.

# మతతత్వ శక్తులకు కేరళలో చోటు లేదు

కేరళ (ఏడీఎన్ఎన్) :



కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోరెత్తించారు. ముట్టతారలో బుధవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ప్రధాని నరేంద్ర మోడీకి, కేరళ సీఎం పినరయి విజయన్‌కు మధ్య ఎటువంటి తేడా లేదని విమర్శించారు. కేరళ భవిష్యత్తును అపహరించేందుకు వీరిద్దరూ ఒకే బాటలో పయనిస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ తన ఓటు బ్యాంకును పినరయి విజయన్‌కు బదిలీ చేస్తూ, కాంగ్రెస్ కూటమిని అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కేరళ ప్రజలు చైతన్యవంతులని, మతతత్వ శక్తులను రాష్ట్రంలోకి రాకుండా లక్ష్మణ రేఖ గీశారని కొనియాడారు. తెలంగాణ అభివృద్ధిని ప్రస్తావిస్తూ, సోనియా గాంధీ చొరవ వల్లే తెలంగాణ నేడు దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సోనియా గాంధీ రాష్ట్రాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వెల్లడించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే వారికే ఓటు వేయాలని కేరళ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం కేరళలో బిజీబిజీగా పర్యటిస్తున్న రేవంత్ రెడ్డి.. ముట్టతార, భారతన్నూర్, పూవాచల్ వంటి ప్రాంతాల్లో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొంటూ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు.

# కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సిందే

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ


హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :





తెలంగాణలోని కాజీపేట కేంద్రంగా నూతన రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు సమగ్రమైన లేఖ రాశారు. గత వారం రైల్వే యూనియన్ నాయకులు తనను కలిసి ఈ అంశంపై విన్నవించిన నేపథ్యంలో, వారి ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ పక్కా ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని ఆయన సిద్ధం చేశారు. త్వరలోనే బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు ఈ లేఖను కేంద్ర మంత్రికి నేరుగా అందజేయనున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే పునర్వ్యవస్థీకరణలో భాగంగా కాజీపేట డివిజన్ ఏర్పాటు చేయడం అటు పరిపాలనా పరంగా, ఇటు కార్యాచరణ పరంగా అత్యంత ఆవశ్యకమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ సుమారు 3150 ట్రాక్ కిలోమీటర్ల భారీ పరిధితో విపరీతమైన పని ఒత్తిడికి లోనవుతోందని కేటీఆర్ తన లేఖలో వివరించారు. దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని విజయవాడ, గుంతకల్ వంటి డివిజన్లు 2200 కిలోమీటర్ల లోపు పరిధితో నడుస్తుండగా, సికింద్రాబాద్ డివిజన్ పరిధి మితిమీరి ఉండటం వల్ల నిర్వహణలో జాప్యం, భద్రతా పర్యవేక్షణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భౌగోళికంగా కీలక జంక్షన్ అయిన కాజీపేటలో ఇప్పటికే రైల్వే తయారీ యూనిట్, లోకో మెయింటెనెన్స్ షెడ్ వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని గుర్తు చేశారు. కాజీపేట బల్లార్షా, పెద్దపల్లి నిజామాబాద్, డోర్నకల్ మణుగూరు వంటి కీలక మార్గాలను కలిపి నూతన డివిజన్ ఏర్పాటు చేయడం ద్వారా ఉత్తర, తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు మెరుగుపడతాయని, రైల్వే సేవలు సామాన్యులకు మరింత చేరువవుతాయని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రామీణ విద్యార్థుల కోసం క్రీడా ప్రాంగణాలు



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ఖేలో ఇండియా పథకం కింద క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలని ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బుధవారం ఆయన మాట్లాడుతూ, రామంతపూర్, మేడ్చల్ ప్రాంతాల్లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో సుమారు 1500 మందికి పైగా గ్రామీణ నేపథ్యం ఉన్న విద్యార్థులు చదువుకుంటున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. కేవలం చదువుతోనే కాకుండా, క్రీడల ద్వారా కూడా విద్యార్థులు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా ఈ కళాశాలల్లో వాలీబాల్, బాస్కెట్‌బాల్ , టెన్నిస్ క్రీడల కోసం ఆధునిక సింథటిక్ కోర్టుల నిర్మాణం అత్యంత ఆవశ్యకమని ఈటల పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి సరైన క్రీడా ప్రాంగణాలు తోడ్పడతాయని, అందుకే ఖేలో ఇండియా నిధుల ద్వారా ఈ సింథటిక్ కోర్టుల నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని కేంద్ర క్రీడా శాఖకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని యువతకు మెరుగైన క్రీడా అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# అమరావతి బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు



న్యూఢీల్లి(ఏడీఎన్ఎన్) :

అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా గుర్తించే చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ తరపున పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన గత పదేళ్లలో రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న పరిస్థితులను, అభివృద్ధిని విశ్లేషించారు. విభజన జరిగి దశాబ్దం దాటినా ఏపీ ప్రజలు తమ రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితి రావడం బాధాకరమన్నారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా కలిసి ఉంటూ, అభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీని నెలకొల్పుకోవాలని ఆయన ఆకాంక్షించారు.మరోవైపు తెలంగాణ ఏర్పాటు వెనుక ఉన్న ఆవేదనను కిషన్ రెడ్డి గుర్తుచేశారు. 1969లో ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన 369 మంది విద్యార్థులను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపిందని, మలిదశ ఉద్యమంలోనూ 1200 మంది ఆత్మబలిదానాల తర్వాతే తెలంగాణ సిద్ధించిందని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాల వల్ల నేడు ఏపీలో 7 విమానాశ్రయాలు ఉంటే, తెలంగాణలో కేవలం ఒకటి మాత్రమే ఉందంటూ విమర్శలు గుప్పించారు.

# కాళేశ్వరంపై రాజ్యసభ సాక్షిగా అబద్ధాలు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :




రాజ్యసభలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర మంత్రి సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో అనేకమార్లు గళమెత్తారని, ఈ విషయాన్ని విస్మరించి మంత్రి మాట్లాడటం సరికాదని వినోద్ కుమార్ పేర్కొన్నారు.తెలంగాణలో ఇరిగేషన్ ప్రాజెక్టుల వల్ల వ్యవసాయం రెండింతలు పెరిగిందని ఒకవైపు ఒప్పుకుంటూనే, మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లక్ష కోట్లు నీళ్లలో కలిసిపోయాయని విమర్శించడం మంత్రి ద్వంద్వ నీతికి నిదర్శనమని వినోద్ కుమార్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పతనం ఏంటో మాజీ మంత్రి హరీశ్ రావు ఇప్పటికే గణాంకాలతో సహా అనేకసార్లు వివరించారని గుర్తుచేశారు. అసలు ఈ ప్రాజెక్టుకు లక్ష కోట్లు ఖర్చు కాలేదని, వాస్తవాలను వక్రీకరించి మాట్లాడటం తగదని హితవు పలికారు. సి.ఆర్. పాటిల్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎంపీలు ఇప్పటికే రాజ్యసభకు లేఖ రాశారని, సభ హుందాతనాన్ని కాపాడాలంటే మంత్రి తన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రస్తుతం చంద్రబాబు డైరెక్షన్‌లో నడుస్తూ తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తోందని ఆయన ఆరోపించారు.

# తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత చట్టబద్ధం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :




తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన “తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పరిరక్షణ, పర్యవేక్షణ బిల్లు, 2026” వయోవృద్ధుల సంక్షేమాన్ని బలోపేతం చేసే దిశగా ఒక చారిత్రాత్మక అడుగు అని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రుల సంరక్షణను ఒక నైతిక బాధ్యతగానే కాకుండా, చట్టబద్ధమైన విధిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ బిల్లు ప్రకారం, ఉద్యోగులు తమ తల్లిదండ్రుల ఆర్థిక , వైద్య అవసరాల కోసం తమ వేతనం నుంచి కనీసం 15 శాతం లేదా రూ. 10,000లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని నిబంధనలను వివరించారు.ఈ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రతి ప్రభుత్వ శాఖలో ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను గరిష్టంగా 60 రోజుల్లోపు పరిష్కరించాలని, సంరక్షణలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వృద్ధులకు సమాజంలో గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ఈ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తామని, వయోవృద్ధుల హక్కులను కాపాడతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ బిల్లులోని ముఖ్యాంశాలపై అధికారులకు, ప్రతినిధులకు వివరణ ఇచ్చారు.



# పారాక్వాట్' గడ్డిమందుపై సర్కార్ ఉక్కుపాదం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో అత్యంత విషపూరితమైన 'పారాక్వాట్' గడ్డిమందుపై ప్రభుత్వం తక్షణ నిషేధం విధించింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ ఉత్తర్వులు నేటి నుంచే అమల్లోకి వస్తాయని, తదుపరి 60 రోజుల పాటు ఈ నిషేధం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.పారాక్వాట్ గడ్డి మందు వినియోగం వల్ల రాష్ట్రంలో ఇప్పటివరకు 1167 మంది ప్రాణాలు కోల్పోయారని, దీనికి సరైన విరుగుడు మందు లేకపోవడం వల్లే మరణాల సంఖ్య పెరుగుతోందని మంత్రి తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. పొలాల్లో పిచికారీ చేసే సమయంలో చర్మంపై పడినా, కళ్లలో పడినా తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, పొరపాటున తాగితే అవయవాలు విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. అందుకే ఈ మందు అమ్మకాలు, నిల్వలు, పంపిణీపై పూర్తి నిషేధం విధించామని, ఆన్‌లైన్ విక్రయాలపై కూడా సైబర్ క్రైమ్ నిఘా ఉంటుందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇదే సమావేశంలో రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల సుమారు 31,504 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు మంత్రి వెల్లడించారు. ప్రధానంగా మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లిందని, పూర్తి నివేదికను త్వరగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపులు జరిగాయని, రైతులకు పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. అలాగే, 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' గ్రామసభల్లో రైతులకు సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడి, పారాక్వాట్ నిషేధంపై అవగాహన కల్పించాలని నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెంలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, కొడంగల్‌లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.



# నిరుద్యోగుల పాలిట శాపంగా జీవోలు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

ప్రభుత్వ నిర్ణయాల వల్ల రాష్ట్రంలోని పేదలు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేస్తున్నారనే నెపంతో ప్రభుత్వం రేషన్ కార్డులను రద్దు చేయాలని చూడటంపై ఆమె ధ్వజమెత్తారు. కొత్తగా 5 లక్షల కార్డులు ఇస్తామని చెప్పి, పాతవి 10 నుంచి 15 లక్షల కార్డులను తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. చిన్నపాటి ప్రైవేటు ఉద్యోగాలు చేసుకునే వారిపై ఇటువంటి పైశాచిక నిర్ణయాలు తీసుకుంటే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె, అంగన్‌వాడీలకు జీతాలు, బాలింతలకు ఇచ్చే కిట్లు, కేసీఆర్ కిట్ నిధులను ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు.మరోవైపు, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దక్కకుండా ప్రభుత్వం రకరకాల జీవోలతో అడ్డంకులు సృష్టిస్తోందని కవిత ఆరోపించారు. ముఖ్యంగా డిగ్రీ లెక్చరర్ల నియామకాల్లో తమ వారికి మేలు చేసేలా జీవో నంబర్ 4ను తెచ్చారని, పీహెచ్‌డీకి 25 మార్కుల వెయిటేజీ ఇవ్వడం ఇందులో భాగమేనని పేర్కొన్నారు. డీఎస్సీకి జీవో 104, గ్రూప్స్ కు జీవో 29, పోలీసు ఉద్యోగాలకు జీవో 46 వంటివి నిరుద్యోగుల పాలిట శాపంగా మారాయని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీతో హామీలు ఇప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు నిరుద్యోగుల నెత్తిమీద కాలు పెట్టి తొక్కుతోందని ఎద్దేవా చేశారు. వెంటనే వివాదాస్పద జీవోలను రద్దు చేయాలని, లేదంటే నిరుద్యోగులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



# ఇప్ప పువ్వుతో గ్రామీణ వికాసం

- ముఖ్యమంత్రికి అనిరుధ్ రెడ్డి లేఖ

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేపట్టిన 'ఇప్ప చెట్ల పెంపకం' ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో 10 లక్షల ఇప్ప చెట్లను నాటాలన్న లక్ష్యంతో ఆయన సాగిస్తున్న ఈ ప్రయత్నానికి అనూహ్య మద్దతు లభిస్తోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా అనిరుధ్ రెడ్డి ఈ డిమాండ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే వివిధ పార్టీలకు చెందిన 52 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ ప్రతిపాదనకు మద్దతు తెలుపుతూ సంతకాలు చేయడం విశేషం.ముఖ్యమంత్రికి రాసిన లేఖలో అనిరుధ్ రెడ్డి ఇప్ప చెట్ల విశిష్టతను వివరించారు. తెలంగాణలోని అర్ధ శుష్క ప్రాంతాలకు ఇవి ఎంతో అనువైనవని, కరువును తట్టుకుని పెరగడమే కాకుండా భూక్షయాన్ని నివారిస్తాయని పేర్కొన్నారు. కేవలం పర్యావరణమే కాకుండా, ఇప్ప పువ్వులు మరియు గింజల ద్వారా గిరిజన, గ్రామీణ ప్రజలకు మంచి ఆదాయం లభిస్తుందని వివరించారు. పోషక విలువలు, ఔషధ గుణాలున్న ఇప్ప ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి, జీవనోపాధికి ఎంతో మేలు చేస్తాయని, అందుకే ప్రభుత్వమే ఒక ఉద్యమంలా ఈ పెంపకాన్ని చేపట్టాలని ఆయన కోరారు. ఒక ఎమ్మెల్యే ప్రారంభించిన ఈ వినూత్న ఉద్యమంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
02.04.2026
www.manasarkar.com

# రాశి ఫలాలు

**02-04-2026 గురువారం**

**మేషం:**
వ్యాపారాల్లో ముందుకు దూసుకుపోతారు. పోటీదార్ల బెడద చాలా వరకు తగ్గుతుంది. ప్రయత్న లోపం లేకపోతే ముఖ్యమైన వ్యవహారాలన్నీ సకాలంలో, సంతృప్తికరంగా పూర్తవుతాయి. విద్యార్థులు ఘన విజయాలు సాధిస్తారు. ఆదాయానికి, ఆరోగ్యానికి లోటుండదు.

**వృషభం:**
వృత్తి, వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండడం మంచిది. బంధువుల నుంచి ఆశించిన శుభవార్తలు వింటారు. ఆదాయం వృద్ధి చెందుతుంది. ఆర్థిక పరిస్థితులు చాలావరకు మెరుగుపడతాయి. వృథా ఖర్చుల్ని తగ్గించుకోవడం మంచిది.

**మిథునం:**
ఉద్యోగంలో అధికారులతో సామరస్యం పెరుగుతుంది. జీతభత్యాలు పెరిగే అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. కొద్దిగా ఆలస్యంగానే అయినప్పటికీ ముఖ్యమైన వ్యవహారాలు విజయవంతంగా పూర్తవుతాయి.

**కర్కాటకం:**
ఉద్యోగంలో సానుకూలతలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాల్లో కొత్త ఆలోచనలు ప్రవేశపెడతారు. నిరుద్యోగులకు మంచి కంపెనీల నుంచి ఆఫర్లు వచ్చే అవకాశం ఉంది. పెళ్లి ప్రయత్నాల్లో చికాకులుంటాయి. సోదరులతో సఖ్యత పెరుగుతుంది. కుటుంబ సమస్యలు పరిష్కారమవుతాయి.

**సింహం:**
వృత్తి, ఉద్యోగాల్లో ఊహించని ప్రోత్సాహకాలు అందుకుంటారు. వ్యాపారాలు ఆశాజనకంగా పురోగమిస్తాయి. ఇంటా బయటా బాధ్యతలు పెరుగుతాయి. అనుకోకుండా కొన్ని వివాదాలు, సమస్యలు పరిష్కారం అవుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

**కన్య:**
వృత్తి, ఉద్యోగాలు గౌరవాభిమానాలతో సాగిపోతాయి. వ్యాపారాల్లో ఆశించిన స్థాయిలో లాభాలు పెరుగుతాయి. కుటుంబ సభ్యుల మీద భారీగా ఖర్చు చేస్తారు. విద్యార్థులు తేలికగా విజయాలు సాధిస్తారు. ఆదాయ ప్రయత్నాలు ఫలిస్తాయి. దైవకార్యాల్లో పాల్గొంటారు.

**తుల:**
అన్ని విధాలా సమయం అనుకూలంగా ఉంది. ఆదాయం బాగానే వృద్ధి చెందుతుంది. ఉద్యోగంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి జీవితంలో డిమాండ్ విస్తరిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా పురోగమిస్తాయి. ఇంటా బయటా గౌరవమర్యాదలుంటాయి. ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.


**వృశ్చికం:**
ఉద్యోగంలో పనిభారం పెరుగుతుంది. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. జీవిత భాగస్వామి సహాయ సహకారాలుంటాయి. కొందరు సన్నిహితులతో అపార్థాలు తలెత్తే సూచనలున్నాయి. బంధువుల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉంది.

**ధనస్సు:**
అనుకోకుండా ఆదాయం పెరిగే అవకాశం ఉంది. కొన్ని ఖర్చుల్ని తగ్గించుకోవడం మంచిది. వ్యక్తిగత సమస్యలు బాగా తగ్గుముఖం పడతాయి. కుటుంబ సభ్యుల మీద కోపతాపాలు ప్రదర్శించకపోవడం శ్రేయస్కరం. వృత్తి, వ్యాపారాలకు సంబంధించిన వ్యవహారాల్లో ఇతరుల మీద ఆధారపడ వద్దు.

**మకరం:**
ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా సాగిపోతుంది. వృత్తి, వ్యాపారాల్లో మరింత శ్రద్ధ పెట్టడం మంచిది. ఆర్థిక, వ్యక్తిగత సమస్యల్లో ముఖ్యమైనవి పరిష్కారం అవుతాయి. కొత్త నిర్ణయాలకు, కొత్త ప్రయత్నాలకు సమయం అనుకూలంగా ఉంది. ముఖ్యమైన పనుల్లో ఆటంకాలు తొలగిపోతాయి.

**కుంభం:**
ఉద్యోగ జీవితం ప్రశాంతంగా, అనుకూలంగా సాగుతుంది. వృత్తి, వ్యాపారాలు లాభదాయకంగా సాగిపోతాయి. ఇష్టమైన బంధుమిత్రుల్ని కలుసుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

**మీనం:**
ఉద్యోగంలో సహోద్యోగులకు సహాయ సహకారాలు అందిస్తారు. వృత్తి, వ్యాపారాల్లో కీలకమైన మార్పులు, చేర్పులు చేపడతారు. ఎవరితోనూ వివాదాలకు వెళ్లకపోవడం మంచిది. కుటుంబ సభ్యుల ద్వారా ఆస్తి వ్యవహారాలు చక్కబడతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.




# ప్రశ్నించే గొంతుకను అణిచివేయలేరు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కమ్యూనిజం సజీవంగా ఉన్నంత కాలం ఈ దేశంలో మావోయిజాన్ని ఎవరూ అంతం చేయలేరని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. మావోయిజానికి మూలం కమ్యూనిజమేనని, మావోయిస్టులు తమ రక్తమేనని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టులను భౌతికంగా అంతం చేయగలిగినా, వారిలోని ప్రశ్నించే తత్వాన్ని అణిచివేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. అర్బన్ నక్సల్స్ పేరుతో మేధావులను వేధిస్తే, పాలకులు చేసే చట్టాలే భవిష్యత్తులో వారికి ఉరితాళ్లుగా మారుతాయని హెచ్చరించారు. లోక్‌సభలో అమిత్ షా చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ.. సల్వాజుడుంపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి సభ్యుడిగా ఉన్న ధర్మాసనం ఇచ్చిన తీర్పును తప్పుపట్టడం హోంమంత్రి హోదాకు తగదని కూనంనేని మండిపడ్డారు. అమిత్ షా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను బెదిరించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా సాగుతున్న డీలిమిటేషన్ ప్రక్రియపై మేధావులతో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. కుల వ్యవస్థను కాపాడే కుట్రలో భాగంగానే మత మార్పిడిపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిందని ఆయన విమర్శించారు.

# నాసా స్పేస్ కాంటెస్ట్ లో శ్రీ చైతన్య ప్రభంజనం

**వరుసగా 15వ సారి ప్రపంచ ఛాంపియన్‌గా రికార్డు**




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికాకు చెందిన నాసా ఎన్ఎస్ఎస్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ 2026 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలు విశ్వవ్యాప్త విజయాన్ని సాధించాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో వరుసగా 15వ సారి వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచి శ్రీ చైతన్య స్కూల్ విజయ దుంధుభి మోగించింది. ఈ ఏడాది పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 31 దేశాలు పాల్గొనగా, మొత్తం ప్రకటించిన 134 విన్నింగ్ ప్రాజెక్టులలో భారతదేశం 80 అవార్డులను కైవసం చేసుకుంది. ఇందులో విశేషం ఏమిటంటే, భారత్ సాధించిన మొత్తం అవార్డుల్లో 71 శాతం అంటే.. ఏకంగా 57 అవార్డులను ఒక్క శ్రీ చైతన్య విద్యార్థులే గెలుచుకోవడం గమనార్హం. ఈ ఘనత సాధించిన ప్రపంచంలోని ఏకైక విద్యాసంస్థ తమదేనని శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. శ్రీ చైతన్య విద్యార్థులు సాధించిన 57 విన్నింగ్ ప్రాజెక్టులలో ప్రపంచస్థాయి ఫస్ట్ ప్రైజ్ 6, సెకండ్ ప్రైజ్ 11, థర్డ్ ప్రైజ్ 10 ప్రాజెక్టులతో పాటు హనరేబుల్ మెన్షన్స్ లో మరో 30 ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల్లో మొత్తం 549 మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ శాస్త్రీయ ప్రతిభను చాటారు. ప్రపంచంలోని మిగిలిన 30 దేశాలన్నీ కలిసి మొత్తం 54 విన్నింగ్ ప్రాజెక్టులను గెలుచుకోగా, భారతదేశం నుండి ఒక్క శ్రీ చైతన్య మాత్రమే 57 ప్రాజెక్టులను సాధించడం దేశానికే గర్వకారణమని డైరెక్టర్ సీమ కొనియాడారు. అవార్డుల సంఖ్యలో గానీ, పాల్గొన్న విద్యార్థుల సంఖ్యలో గానీ తమ సంస్థ దరిదాపుల్లోకి మరే ఇతర విద్యాసంస్థ రాలేదని ఆమె పేర్కొన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ముగ్గురు మహిళలపై కత్తితో హత్యాయత్నం

**చిత్తూరు (ఏడీఎన్ఎన్) :**



నగరంలోని గిరింపేట విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం ఉదయం ఘోరం జరిగింది. వ్యవసాయ మోటార్ సర్వీస్ విషయంలో తలెత్తిన చిన్న వివాదం కాస్తా విచక్షణారహిత దాడికి దారితీసింది. ఆరిమకులపల్లి గ్రామానికి చెందిన వి. భాస్కర్ నాయుడు, తన బంధువులైన సరస్వతి, సులోచన, లక్ష్మిలపై కత్తితో దాడికి పాల్పడ్డారు. వ్యవసాయ మోటార్ సర్వీస్ మార్పిడికి సంబంధించి ఇరువర్గాల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గిరింపేటలోని విద్యుత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ విచారణ నిమిత్తం ఇరువర్గాలు హాజరయ్యారు. అధికారులు పిటిషన్‌పై విచారణ జరుపుతున్న సమయంలోనే, భాస్కర్ నాయుడు ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. వెంట తెచ్చుకున్న కత్తితో తన బంధువులైన మహిళలపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ మెరుపు దాడిలో సరస్వతి, సులోచనలకు కడుపు, వీపు భాగాల్లో తీవ్రమైన గాయాలయ్యాయి. లక్ష్మి అనే మహిళ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన బాధితులను గమనించిన విద్యుత్ సిబ్బంది, స్థానికులు తక్షణమే స్పందించి, 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటన తర్వాత నిందితుడు భాస్కర్ నాయుడు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ నెట్టి కంఠయ్య తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇటువంటి ఘాతుకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయంలో, అధికారుల సమక్షంలోనే ఈ స్థాయిలో దాడి జరగడం చిత్తూరులో చర్చనీయాంశంగా మారింది.

# హ్యామ్ రోడ్ల టెండర్లలో కుంభకోణం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి పేరుతో ప్రభుత్వం తీసుకొస్తున్న హ్యామ్ మోడల్ టెండర్లలో భారీ కుంభకోణం జరుగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ టెండర్ల ప్రక్రియ అంతా దోపిడీ కోసమేనని ధ్వజమెత్తారు. 6 వేల కిలోమీటర్ల మేర హ్యామ్ మోడల్ రోడ్ల కోసం ప్రభుత్వం రూ.13 వేల కోట్ల టెండర్లు పిలిచిందని, ఇందులో మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతోనే రూ.8 వేల కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. టెండర్లలో ఎక్సెస్ మొత్తాన్ని వేసుకోవాలని ప్రభుత్వమే సలహాలు ఇస్తోందని, మొబిలైజేషన్ కింద 10 శాతం నిధులను ముందే ఇస్తామని చెప్పడం వెనుక ఉన్న ఆంతర్యం అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్ రోడ్ల విస్తరణకు కిలోమీటరుకు రూ.3.30 కోట్లు కేటాయించారని, మెయింటెనెన్స్ కోసం ఏకంగా రూ.10 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారని ఆయన ఆరోపించారు. ఆర్ అండ్ బి విభాగంలో గతంలో ఎలాంటి పనులు చేసిన అనుభవం లేని జె ఇన్‌ఫ్రా, బృందా ఇన్‌ఫ్రా వంటి కంపెనీలకు ఈ కాంట్రాక్టులు కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దీనిపై తాము విజిలెన్స్ కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే హ్యామ్ మోడల్ రోడ్ల విషయంలో పునరాలోచించి, రివ్యూ చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంలో బీజేపీ ఎంపీలు వెంటనే జోక్యం చేసుకొని అవినీతిని అడ్డుకోవాలని, లేనిపక్షంలో ఈ దోపిడీలో బీజేపీకి కూడా భాగస్వామ్యం ఉందని భావించాల్సి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# సామాన్యులకు భారంగా మీ సేవ ధరలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**





తెలంగాణలో మీసేవ కేంద్రాల ద్వారా పొందే వివిధ ధ్రువీకరణ పత్రాల సేవా రుసుములను ప్రభుత్వం భారీగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన నిర్వహణ ఖర్చులు, విద్యుత్ బిల్లులు, ఇంటర్నెట్, సిబ్బంది వేతనాల దృష్ట్యా తమకు వచ్చే కమీషన్ పెంచాలని మీసేవ నిర్వాహకులు చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. తాజా జీవో ప్రకారం, గతంలో రూ. 45 నుంచి రూ. 55 మధ్య ఉన్న ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల ధరలను ఏకంగా రూ. 80కి పెంచారు. అలాగే జనన ధ్రువీకరణ పత్రం ప్రింట్ ధరను రూ. 45 నుంచి రూ. 62కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెరిగిన ధరలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమలులోకి రానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులపై అదనపు ఆర్థిక భారాన్ని మోపనుంది. సాధారణంగా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకునే సమయంలో ఈ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ఒకేసారి సేవా రుసుములను దాదాపు 50 శాతం మేర పెంచడం పట్ల మధ్యతరగతి, పేద వర్గాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మీసేవ కేంద్రాల నిర్వాహకుల సమస్యలను పరిష్కరించే క్రమంలో సామాన్యుల ప్రయోజనాలను విస్మరించకూడదని ప్రజలు కోరుతున్నారు. పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఈ ధరల పెరుగుదల సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టేలా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ గా పఠాన్ ఖాదర్ ఖాన్

**బీజేపీ నేతల ఘన సన్మానం**

**మదనపల్లి (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పఠాన్ ఖాదర్ ఖాన్‌ను భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు, నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుందని అనడానికి ఖాదర్ ఖాన్ నియామకమే నిదర్శనమని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ బలోపేతానికి, భాషా వికాసానికి పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. అకాడమీ అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు, అవసరమైన సహాయ సహకారాలు అందేలా తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయభారతి అధినేత సేతు, రాజంపేట జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు ఆకుల కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు బర్నేపల్లి రవికుమార్, డాక్టర్ అజ్మతుల్లాఖాన్, బీజేపీ వర్మ, పూల నాగరాజు పాల్గొన్నారు. అలాగే యువ నాయకులు కోసూరి భవాని, మణికంఠ రెడ్డి నాయక్, ఇతర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఖాదర్ ఖాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉద్యోగిపై యజమాని దాష్టీకం!

**మచిలీపట్నం (ఏడీఎన్ఎన్) :**




కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పోతేపల్లిలో మానవత్వం మంటగలిసే ఘటన వెలుగుచూసింది. దొంగతనం చేశాడనే నెపంతో ఒక యజమాని తన వద్ద పనిచేసే మేనేజర్‌ను చిత్రహింసలకు గురిచేశాడు. కేవలం కొద్దిపాటి విలువైన వస్తువులు పోయాయన్న అనుమానంతో కక్షగట్టి, ప్రైవేట్ భాగాలపై పచ్చిమిర్చి, వెల్లుల్లి మిశ్రమాన్ని పూసి పైశాచికానందం పొందాడు. పోతేపల్లి జ్యుయలరీ పార్క్ లోని 'ఉషా గోల్డ్' పరిశ్రమలో పరిమి రవికుమార్ ఏడాది కాలంగా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం పరిశ్రమ యజమాని తోట రామసురేష్, రోల్డ్ గోల్డ్ తయారీ పరికరాలు పోయాయని రవికుమార్‌ను నిలదీశారు. తనకు సంబంధం లేదని రవికుమార్ మొత్తుకున్నా వినకుండా, మరో ముగ్గురు ఉద్యోగులు రమేష్, మోను, కునాల్ లతో కలిసి యజమాని దాడికి దిగాడు. బాధితుడిని గదిలో బంధించి కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. బాధితుడిని గదిలో బంధించి కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. 20 వేల విలువైన పరికరాలు పోయాయని, సాయంత్రం లోపు రూ. 2 లక్షలు ఇస్తేనే వదులుతామని బెదిరించారు. మధ్యాహ్నం సమయంలో భర్త ఫోన్ స్విచాఫ్ రావడంతో అనుమానం వచ్చిన రవికుమార్ భార్య రజనీకుమారి, తన సోదరుడితో కలిసి కంపెనీ వద్దకు వెళ్లారు. అక్కడ తన భర్తను నిర్బంధించిన విషయాన్ని గమనించి నిలదీయడంతో, యజమాని రవికుమార్‌ను వదిలిపెట్టాడు. వెంటనే తీవ్ర గాయాలతో ఉన్న బాధితుడిని మచిలీపట్నం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ అమానవీయ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. యజమాని రామసురేష్‌తో పాటు సహకరించిన ఇతర ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.




# రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ షాపుల సమ్మె

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో చికెన్ రిటైల్ వ్యాపారులు సమ్మెకు దిగడంతో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు జిల్లాల వ్యాప్తంగా చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. కిలో చికెన్‌పై తమకు లభిస్తున్న మార్జిన్ సరిపోవడం లేదని, పెరిగిన నిర్వహణ ఖర్చుల దృష్ట్యా లాభాలను పెంచాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర రిటైల్ దుకాణదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సమ్మెకు పిలుపునివ్వగా, హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద భారీ ధర్నా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం, పౌల్ట్రీ యజమానులు తమ డిమాండ్లపై స్పందించే వరకు దుకాణాలు తెరవబోమని వ్యాపారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం కిలో చికెన్‌పై లభిస్తున్న రూ. 26 మార్జిన్‌ను రూ. 40కు పెంచాలని వ్యాపారులు కోరుతున్నారు. దుకాణాల అద్దెలు, విద్యుత్ చార్జీలు, రవాణా ఖర్చులు, కార్మికుల జీతాలు గణనీయంగా పెరిగాయని, ఈ పరిస్థితుల్లో వ్యాపారం కొనసాగించడం కష్టసాధ్యమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పౌల్ట్రీ రంగంలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగిందని, చిన్న రిటైలర్లకు సరైన కమిషన్లు అందడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, స్థిరమైన ధరలు, తగిన మార్జిన్ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమ్మె ప్రభావం వినియోగదారులపై పడే అవకాశం ఉంది. చికెన్ సరఫరా నిలిచిపోవడంతో మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



# కొండగట్టులో పందిరి కూలి 15 మందికి గాయాలు

**కొండగట్టు (ఏడీఎన్ఎన్) :**

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న ఆలయంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిరి కూలిపోవడంతో సుమారు 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా మూడు రోజుల ఉత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. మాల విరమణ కోసం వచ్చిన భక్తుల రద్దీ మధ్య ఈ ఘటన చోటుచేసుకోవడం ఆందోళన కలిగించింది. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మరుగుదొడ్లు, ఎండ నుంచి రక్షణ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, పందిరి నాసిరకంగా ఏర్పాటు చేయడం వల్లే కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



# బ్యాంక్‌లో మందు పార్టీ చేసుకున్న సిబ్బంది

**యాదాద్రి భువనగిరి జిల్లా (ఏడీఎన్ఎన్) :**

మోత్కూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) బ్యాంకులో సిబ్బంది నిర్వాకం వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి సమయంలో బ్యాంకు చైర్మన్ చాంబర్‌లోనే ప్రైవేటు వ్యాపారులు, దళారులతో కలిసి కొంతమంది ఉద్యోగులు మద్యం సేవించిన ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానికులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు ప్రాంగణంలోనే ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడటం అనుచితమని విమర్శిస్తున్నారు. అదేవిధంగా, దళారుల నుంచి లంచాలు స్వీకరించి అర్ధరాత్రి వేళల్లోనే రుణాలు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారుల దృష్టికి విషయం చేరడంతో విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## శీతల్ దేవికి 'వరల్డ్ బెస్ట్ పారా ఆర్చర్' అవార్డు!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రెండు చేతులూ లేకపోయినా లక్ష్యాన్ని ఛేదించడంలో తనకు సాటి లేరని నిరూపించిన భారత పారా ఆర్చర్ శీతల్ దేవి, మరో అంతర్జాతీయ గౌరవాన్ని దక్కించుకున్నారు. ప్రపంచ ఆర్చరీ సమాఖ్య 2025 సంవత్సరానికి గాను ఆమెను 'ఉత్తమ పారా ఆర్చర్'గా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న మాటలు ప్రతి ఒక్కరిలోనూ పట్టుదలను నింపుతున్నాయి. ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారిణులతో పోటీపడి ఈ పురస్కారాన్ని గెలుచుకోవడం పట్ల శీతల్ హర్షం వ్యక్తం చేశారు. "ఈ అవార్డు నాకెంతో ప్రత్యేకం. ఇది కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదు, నా కష్టం, నేను తట్టుకున్న ఎదురుదెబ్బలు, చేసిన త్యాగాలకు ప్రతిఫలం" అని ఆమె పేర్కొన్నారు. "మన పరిమితులను లేదా హద్దులను నిర్దేశించే అవకాశం ఇంకొకరికి ఇవ్వకూడదు. ఓపిగ్గా ఉంటూ, ఒక పద్ధతిని అనుసరిస్తూ ముందుకు సాగిపోవాలి." అని పిలుపునిచ్చారు. గత ఏడాది తన టెక్నిక్‌ను మార్చుకోవాల్సి రావడం కెరీర్‌లోనే అతి పెద్ద సవాలుగా నిలిచిందని, పట్టుదలతో దాన్ని అధిగమించానని ఆమె వెల్లడించారు. తన ఈ విజయ ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. "నా కుటుంబం, కోచ్, నా బృందం.. నా మీద నమ్మకముంచి అండగా నిలబడబట్టే నేనిలా ముందుకు సాగగలుగుతున్నాను. నాపై ఆశీస్సులు కురిపిస్తున్న రాణీ మాతకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను" అని శీతల్ భావోద్వేగంతో చెప్పారు.



## టీమిండియా వరల్డ్ రికార్డ్ బ్రేక్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మహిళా క్రికెట్ ప్రపంచంలో కివీస్, భారత్ రికార్డును తిరగరాసింది. అసాధ్యమనుకున్న భారీ లక్ష్యాన్ని ఛేదించి న్యూజిలాండ్ మహిళా జట్టు చరిత్ర సృష్టించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో కివీస్ వీరోచిత పోరాటం చేసి, గతంలో టీమ్ ఇండియా పేరిట ఉన్న అత్యధిక లక్ష్య ఛేదన రికార్డును తుడిచిపెట్టేసింది. గతంలో న్యూజిలాండ్‌పై భారత్ 341 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. అయితే, ఇప్పుడు అదే కివీస్ జట్టు దక్షిణాఫ్రికా నిర్దేశించిన 347 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి ఆ రికార్డును తన ఖాతాలో వేసుకుంది. 49.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 350 పరుగులు చేసిన న్యూజిలాండ్, మహిళా వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన ఛేజింగ్‌ను నమోదు చేసింది. ఈ చారిత్రాత్మక విజయంలో కివీస్ స్టార్ ప్లేయర్ అమెలియా కెర్ వెన్నెముకగా నిలిచింది. కేవలం 139 బంతుల్లోనే 23 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 179 పరుగులు చేసి దక్షిణాఫ్రికా బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టింది. ఆమెకు తోడుగా ఇసాబెల్లా గేజ్ (68) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఒక దశలో వరుసగా మూడు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడినా, కెర్ పట్టుదలతో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 346/ 6 స్కోరు సాధించినప్పటికీ, కివీస్ పోరాట పటిమ ముందు అది సరిపోలేదు. మూడు వన్డేల ఈ సిరీస్‌లో ప్రస్తుతం ఇరు జట్లూ 1 1తో సమంగా ఉన్నాయి. సిరీస్ విజేతను నిర్ణయించే ఆఖరి, మూడో వన్డే ఏప్రిల్ 4వ తేదీన జరగనుంది.

## ఓలా ఎలక్ట్రిక్ 'పవర్ ఫుల్' కమ్‌బ్యాక్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



దేశీయ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలో అగ్రగామి సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటుకుంది. గత కొన్ని నెలలుగా ఎదుర్కొన్న ఒడిదొడుకులను అధిగమించి, మార్చి నెలలో అసాధారణ వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరితో పోలిస్తే ఏకంగా 150 శాతం వృద్ధి సాధించి, ఈవీ మార్కెట్‌లో తన పట్టును నిరూపించుకుంది. ప్రభుత్వ 'వాహన్' (Vahan) డేటా ప్రకారం ఓలా మార్చి రిజిస్ట్రేషన్లు 10,117 యూనిట్లు ఉన్నాయి. ఫిబ్రవరిలో నమోదైన 3,973 యూనిట్ల కంటే ఇది రెండున్నర రెట్లు ఎక్కువ. మార్చి చివరి వారంలో ప్రతిరోజూ సగటున 1,000 యూనిట్ల విక్రయాలు జరగడం విశేషం. ఒకప్పుడు సర్వీసింగ్ ఆలస్యం, స్పేర్ పార్టుల కొరత వంటి కారణాలతో వినియోగదారుల నుంచి విమర్శలు ఎదుర్కొన్న ఓలా, ఆ లోపాలను సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టింది. సర్వీస్ సెంటర్లకు వచ్చే వాహనాల్లో 80 శాతాన్ని అదే రోజు రిపేర్ చేసి డెలివరీ ఇస్తోంది. దేశవ్యాప్తంగా సర్వీస్ సెంటర్లను పెంచడంతో పాటు స్పేర్ పార్టుల లభ్యతను మెరుగుపరిచింది. కంపెనీ చేపట్టిన ఈ దిద్దుబాటు చర్యల వల్ల వినియోగదారుల్లో మళ్లీ నమ్మకం పెరిగిందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. భారత ఈవీ చరిత్రలో 1 మిలియన్ విక్రయాల మైలురాయిని చేరుకున్న తొలి ఎలక్ట్రిక్ వాహన సంస్థగా ఓలా ఎలక్ట్రిక్ రికార్డు సృష్టించింది. భవిష్యత్తులోనూ ఇదే జోరును కొనసాగిస్తూ సరికొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకువస్తామని కంపెనీ ధీమా వ్యక్తం చేసింది.

# లక్నోపై ఢిల్లీ క్యాపిటల్స్ ఘనవిజయం




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా బుధవారం లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన పోరులో ఢిల్లీ ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన లక్నో జట్టును ఢిల్లీ బౌలర్లు తమ పదునైన బౌలింగ్‌తో కట్టడి చేశారు. నటరాజన్ 29 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, ఎంగిడి కూడా 27 పరుగులకు 3 వికెట్లు తీసి లక్నో పతనాన్ని శాసించారు. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో లక్నో బ్యాటర్లు భారీ స్కోర్లు చేయలేకపోయారు. అబ్దుల్ సమద్ (36), మిచెల్ మార్ష్ (35) మాత్రమే కాస్త పోరాడటంతో లక్నో 18.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయింది. 142 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆరంభంలోనే లక్నో బౌలర్లు షాక్ ఇచ్చారు. మహ్మద్ షమీ, మొహిసిన్ ఖాన్, ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేసి స్వల్ప వ్యవధిలోనే 4 కీలక వికెట్లు తీయడంతో ఢిల్లీ ఒత్తిడిలో పడింది. బ్యాటింగ్‌కు ఏమాత్రం సహకరించని పిచ్‌పై లక్ష్యం చిన్నదైనా విజయం కష్టమనిపించింది. అయితే ఈ క్లిష్ట సమయంలో యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సమీర్ రిజ్వీ 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 70 పరుగులు చేసి ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి ట్రిస్టన్ స్టబ్స్ చక్కని సహకారం అందించాడు. స్టబ్స్ కూడా 32 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో అజేయంగా 39 పరుగులు చేయడంతో, వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివరకు ఢిల్లీ క్యాపిటల్స్ 17.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. 6 వికెట్ల తేడాతో విజయం సాధించిన ఢిల్లీ, ఈ సీజన్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఓటమి అంచున ఉన్న జట్టును గెలిపించిన సమీర్ రిజ్వీ వీరోచిత ఇన్నింగ్స్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

## ఐపీఎల్ చరిత్రలో చెత్త రికార్డు సాధించిన అర్ష్‌దీప్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL 2026) లో భాగంగా పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఒక అరుదైన, చెత్త రికార్డు కూడా నమోదైంది. పంజాబ్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఏకంగా 11 బంతులతో కూడిన సుదీర్ఘ ఓవర్ వేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఒక ఓవర్ అంటే ఆరు బంతులు అన్న ప్రాథమిక సూత్రాన్ని మర్చిపోయేలా వరుస వైడ్లు, నో బాల్స్ తో అర్ష్‌దీప్ ఈ అన్ వాంటెడ్ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గుజరాత్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో (20వ ఓవర్) పంజాబ్ కెప్టెన్ అర్ష్‌దీప్‌కు బంతిని అప్పగించాడు. అప్పటికే తెవాటియా క్రీజులో ఉండటంతో మ్యాచ్‌ను కట్టుదిట్టంగా ముగిస్తాడని భావించగా, అర్ష్‌దీప్



అనూహ్యంగా తడబడ్డాడు. తొలి బంతినే వైడ్‌గా ప్రారంభించిన అర్ష్‌దీప్, ఆ తర్వాత వరుసగా లైన్ అండ్ లెంగ్త్ తప్పాడు. వైడ్లు, నో బాల్స్ కలుపుకుని ఏకంగా 5 ఎక్స్‌ట్రా బంతులు వేశాడు. ఒక వైడ్ బాల్‌ను అంపైర్ ప్రకటించినప్పటికీ, డీఆర్ఎస్ ద్వారా దాన్ని వెనక్కి తీసుకోవడంతో ఆ ఓవర్ 11 బంతుల వద్ద ముగిసింది. ఐపీఎల్ చరిత్రలో ఒకే ఓవర్లో 11 బంతులు వేసిన ఆరో బౌలర్‌గా అర్ష్‌దీప్ నిలిచాడు. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ గా పేరున్న అర్ష్‌దీప్ ఇలా తడబడటంపై విశ్లేషణలు మొదలయ్యాయి. ముల్లాన్‌పూర్ పిచ్‌పై బంతిపై గ్రిప్ దొరక్కపోవడం లేదా తెవాటియా వంటి ఫినిషర్ ఒత్తిడి వల్ల అర్ష్‌దీప్ నియంత్రణ కోల్పోయి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఓవర్లో తెవాటియా ఫోర్ బాదడమే కాకుండా ఎక్స్‌ట్రాల రూపంలో పంజాబ్ స్కోరును గుజరాత్ పెంచేసింది. అదృష్టవశాత్తూ, బ్యాటింగ్‌లో కూపర్ కానోలీ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడటంతో అర్ష్‌దీప్ చేసిన తప్పిదం పంజాబ్ విజయానికి అడ్డంకిగా మారలేదు. అయితే, కీలకమైన టోర్నీ దశలో ఇలాంటి పొరపాట్లు జట్టు విజయావకాశాలను దెబ్బతీస్తాయని మాజీ క్రికెటర్లు హెచ్చరిస్తున్నారు.

## ఐపీఎల్ 2026: ఆరెంజ్ క్యాప్ రేసులో రికెల్టన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభమై కేవలం నాలుగు మ్యాచ్‌లే పూర్తయినప్పటికీ, మైదానంలో పరుగుల వరద, వికెట్ల వేట అప్పుడే హీటెక్కించాయి. ముంబై ఇండియన్స్ యువ బ్యాటర్ రయాన్ రికెల్టన్ ప్రస్తుతం పరుగుల వేటలో అందరి కంటే ముందున్నాడు. కోల్‌కతాపై మెరుపు ఇన్నింగ్స్ ఆడిన అతను అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ ఉత్కంఠభరిత పోరాటంలో అత్యధిక పరుగులు చేసిన వారికి ఇచ్చే ఆరెంజ్ క్యాప్, అత్యధిక వికెట్లు తీసిన వారికి దక్కే పర్పుల్ క్యాప్ కోసం పోటీ మొదలైపోయింది. ఈ ఆరెంజ్ క్యాప్ రేసులో ముంబై ప్లేయర్ రికెల్టన్ 81 పరుగులతో పోటాపోటీగా దూసుకుపోతున్నాడు. బ్యాటర్లు సిక్సర్లతో విరుచుకుపడుతుంటే, బౌలర్లు తమ పదునైన బంతులతో వికెట్లు పడగొడుతున్నారు. ప్రస్తుతానికి ఆరెంజ్, పర్పుల్ క్యాప్ రేసులో యువ ఆటగాళ్లు సీనియర్లకు గట్టి పోటీనిస్తూ అగ్రస్థానంలో నిలిచారు. రికెల్టన్ తర్వాతి స్థానంలో సన్ రైజర్స్ ఇషాన్ కిషన్ 80 పరుగులతో పోటీపడుతున్నాడు. తర్వాతి స్థానంలో 78 పరుగులతో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ నిలిచాడు. బౌలింగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) పేసర్ జాకబ్ డఫీ, గుజరాత్ టైటాన్స్ కు చెందిన ప్రసిద్ధ కృష్ణ, పంజాబ్ కింగ్స్ వైశాక్ విజయ్‌కుమార్ తలో 3 వికెట్లతో పోటాపోటీగా ఉన్నారు. విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ వంటి దిగ్గజాలు ఇంకా భారీ ఇన్నింగ్స్ లు ప్రారంభించాల్సి ఉండగానే, రికెల్టన్ వంటి కొత్త ఆటగాళ్లు ఆరెంజ్ క్యాప్ రేసులోకి రావడం విశేషం. అలాగే పర్పుల్



క్యాప్ కోసం ప్రసిద్ధ్ కృష్ణ, వైశాక్ వంటి దేశీయ బౌలర్లు విదేశీ ఆటగాళ్లతో సమానంగా పోటీ పడటం భారత క్రికెట్ అభిమానులను అలరిస్తోంది.

## వాహనదారులకు షాక్



**పెరిగిన ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలు**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

దేశవ్యాప్తంగా సామాన్యులపై ఇంధన భారం మరింత పెరిగింది. ఇప్పటికే నిత్యావసర ధరలతో సతమతమవుతున్న ప్రజలకు చమురు కంపెనీలు మరో చేదు వార్త వినిపించాయి. ప్రీమియం పెట్రోల్ ధరల బాటలోనే ఇప్పుడు ప్రీమియం డీజిల్ ధరలను కూడా సవరిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ప్రముఖ చమురు సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (IOCL), తన ప్రీమియం ఇంధన విభాగంలో ధరల పెంపును ప్రకటించింది. ప్రీమియం డీజిల్ (ఎక్స్‌ట్రా గ్రీన్) ధర లీటరుకు సుమారు రూ. 1.50 మేర పెరిగింది. ఈ పెరిగిన ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచే అమలులోకి వచ్చాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో ప్రీమియం డీజిల్ ధర ఇప్పుడు లీటరుకు రూ. 95 నుంచి రూ. 96 మధ్య పలుకుతోంది. XP100 పెట్రోల్ లీటరుకు రూ.11 పెరిగి, రూ.149 నుండి రూ. 160 కి చేరింది. ఎక్స్‌ట్రా గ్రీన్ డీజిల్ కూడా ఒకటిన్నర రూపాయి పెరిగి రూ.91.49 నుండి 92.99కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో వస్తున్న హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ బలహీనపడటమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని చమురు సంస్థలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక, రాజకీయ పరిస్థితులు ఇంధన సరఫరాపై ప్రభావం చూపుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రీమియం డీజిల్ ధరల పెంపు ప్రధానంగా ఈ క్రింది రంగాలపై అదనపు భారం మోపనుంది. సరుకు రవాణా చేసే భారీ వాహనాలు ప్రీమియం డీజిల్ వాడటం వల్ల రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, హార్వెస్టర్లు వాడే రైతులపై పెట్టుబడి భారం పెరుగుతుంది. సాధారణ డీజిల్‌తో పోలిస్తే ప్రీమియం డీజిల్ మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజీని ఇస్తున్నప్పటికీ.. పెరుగుతున్న ధరల కారణంగా వినియోగదారులు మళ్లీ సాధారణ డీజిల్ వైపు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది. అయితే ఇలా వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలు పరోక్షంగా నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారి తీస్తాయేమోనని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## విమాన ప్రయాణికులకు 'ధరల' షాక్

**రూ. 2 లక్షలు దాటిన ఇంధన ధర!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

విమాన ప్రయాణికులకు దేశీయంగా ప్రయాణం మరింత ఖరీదు కానుంది. ఒకవైపు పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, మరోవైపు రికార్డు స్థాయిలో పెరిగిన ఇంధన ధరలు విమానయాన సంస్థలకు పెను సవాలుగా మారాయి. విమాన ఇంధనం (ATF) ధర చరిత్రలో తొలిసారిగా రూ. 2 లక్షల మార్కును దాటడం ఇప్పుడు పౌర విమానయాన రంగంలో చర్చనీయాంశమైంది. అంతర్జాతీయ ముడి చమురు ధరలకు అనుగుణంగా చమురు కంపెనీలు బుధవారం ఏటీఎఫ్ ధరలను భారీగా సవరించాయి. ఢిల్లీలో లీటర్ ఏటీఎఫ్ ధర ఏకంగా రూ. 1,10,703.08 పెరిగి, ప్రస్తుతం రూ. 2,07,341.22 వద్దకు చేరుకుంది. గతంలో రూ. 96,638 గా ఉన్న



ధర ఇప్పుడు సుమారు 114.5శాతం పెరగడం గమనార్హం. అయితే, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం దేశీయ విమానయాన సంస్థలకు ఈ పెంపులో 8.5శాతం మాత్రమే వర్తిస్తుందని ప్రాథమిక సమాచారం. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ వ్యయంలో సుమారు 40 శాతం కేవలం ఇంధనానికే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఇంధన ధరలు రెట్టింపు కావడంతో, ఆ భారాన్ని తగ్గించుకోవడానికి విమాన సంస్థలు టికెట్ ధరలను పెంచడం లేదా ఫ్యూయెల్ సర్ ఛార్జీ పేరుతో అదనపు బాదుడును పెంచే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. విమానయాన సంస్థలు ప్రస్తుతం రెండు రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ఆకాశ మార్గాలను మళ్లించాల్సి రావడంతో ఇంధన వినియోగం, ప్రయాణ సమయం పెరిగింది. ఏటీఎఫ్ ధరల పెంపుతో ప్రతి విమాన సర్వీసుపై లక్షలాది రూపాయల అదనపు భారం పడుతోంది. ఇప్పటికే పలు ఎయిర్‌లైన్స్ తమ టికెట్లపై సర్ ఛార్జీలను సవరించే పనిలో పడ్డాయి. వేసవి సెలవుల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ ధరల పెరుగుదల సామాన్య ప్రయాణికుల జేబుకు చిల్లు పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.






## స్టార్ ఆల్ రౌండర్‌కు ఆస్ట్రేలియా షాక్

**సెంట్రల్ కాంట్రాక్ట్‌లో మ్యాక్స్ వెల్‌కు దక్కని చోటు**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు 2026-27 సీజన్‌కు సంబంధించి తమ వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించింది. మొత్తం 21 మంది ఆటగాళ్లకు చోటు కల్పించిన ఈ జాబితాలో వెటరన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరు లేకపోవడం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది. టెస్టు ఫార్మాట్‌కు పెద్దపీట వేస్తూ బోర్డు తీసుకున్న ఈ నిర్ణయం మ్యాక్సీ అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలికినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే సీజన్‌లో భారత్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్‌లతో ఆస్ట్రేలియా కీలకమైన టెస్టు సిరీస్‌లు ఆడనుంది. దీంతో కేవలం పరిమిత ఓవర్ల క్రికెట్‌కే పరిమితమైన ఆటగాళ్ల కంటే, సుదీర్ఘ ఫార్మాట్‌లో అందుబాటులో ఉండే వారికే బోర్డు ప్రాధాన్యతనిచ్చింది. 2017లో చివరి టెస్టు ఆడిన మ్యాక్స్వెల్, గతేడాది వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించారు. ప్రస్తుతం 37 ఏళ్ల వయసున్న ఆయన కేవలం టీ20ల్లోనే కొనసాగుతున్నారు. గత టీ20 ప్రపంచకప్‌లోనూ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం, భవిష్యత్తు ప్రణాళికల్లో యువ ఆటగాళ్లకు చోటు ఇవ్వాలనుకోవడంతో మ్యాక్సీని పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాతో పాటు, బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ (2024)లో ఆకట్టుకున్నప్పటికీ ఇటీవల ఫామ్ కోల్పోయిన ఓపెనర్ కోన్స్‌కి కూడా ఈ జాబితాలో చోటు దక్కలేదు. ప్రదర్శనే ప్రాతిపదికగా కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. పాట్ కమిన్స్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్ వంటి సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లకు ఈ జాబితాలో స్థానం లభించింది.



## రికార్డు స్థాయిలో మార్చి నెల జీఎస్టీ వసూళ్లు

**తొలిసారి రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటిన ఆదాయం!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత ఆర్థిక వ్యవస్థలో వస్తు, సేవల పన్ను (GST) వసూళ్లు సరికొత్త చరిత్రను సృష్టించాయి. మార్చి 2026 నెలకు గానూ స్థూల జీఎస్టీ వసూళ్లు ఏకంగా రూ. 2 లక్షల కోట్ల మార్కును దాటాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 8.8 శాతం వృద్ధిని నమోదు చేయడం విశేషం. దేశీయంగా పెరిగిన వినియోగం, దిగుమతులపై పన్ను ఆదాయం పెరగడమే ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. స్థూల జీఎస్టీ ఆదాయం రూ. 2,00,064 కోట్లు కాగా దీనిలో దేశీయ విక్రయాల వాటా రూ. 1.46 లక్షల కోట్లు 5.9 శాతం వృద్ధి సాధించింది. దిగుమతుల ద్వారా ఆదాయం రూ. 53,861 కోట్లతో భారీగా 17.8శాతం వృద్ధి సాధించింది. రిఫండ్ల తర్వాత నికర వసూళ్లు రూ. 1.78 లక్షల కోట్లుగా ఉంది. కేవలం మార్చి నెలలోనే కాకుండా, 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ జీఎస్టీ వసూళ్లు గణనీయమైన వృద్ధిని సాధించాయి. గత ఆర్థిక సంవత్సరంలో (FY25) రూ. 20.55 లక్షల కోట్లుగా ఉన్న వసూళ్లు, ఈసారి 8.3 శాతం పెరిగి రూ. 22.27 లక్షల కోట్లకు చేరాయి. ఇది దేశ ఆర్థిక స్థిరత్వానికి, పన్ను చెల్లింపుల్లో మెరుగుదలకు నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు దాదాపు 18 శాతం పెరగడం మొత్తం ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించింది. ఈఇన్వాయిసింగ్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక మార్పుల వల్ల పన్ను ఎగవేత తగ్గి, వసూళ్లు పెరిగాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు 19 శాతం వృద్ధి సాధించి జీఎస్టీ వసూళ్లలో అగ్రగామిగా నిలిచాయి. ఆర్థిక సంవత్సరం ముగింపులో ఈ స్థాయిలో ఆదాయం రావడం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక లోటును తగ్గించుకోవడానికి, సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించడానికి వెసులుబాటు కలుగుతుంది.

మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
02.04.2026
www.manasarkar.com

# 'ఇస్మార్ట్' ఇమేజ్!



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

తెలుగు తెరపై ఎనర్జీ, అల్లరి, గ్లామర్ ఈ మూడు పదాలు కలిస్తే గుర్తొచ్చే పేరు నభా నటేశ్. స్క్రీన్ పై చిలిపి నవ్వుతో మెరిసే ఆమె, నిజజీవితంలో ఎలా ఉంటారో? తెలుసుకుంటే ఆశ్చర్యపోతాం ''ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత నా జీవితం మారిపోయింది. ఒక్కసారిగా ప్రజలు నన్ను గుర్తుపట్టడం మొదలుపెట్టారు. ఆ మాస్ క్యారెక్టర్ నాకో పెద్ద చాలెంజ్. కాని, తర్వాత కూడా అలాంటి పాత్రలే వచ్చేవి. నాకు ప్రతి సినిమాలో కొత్తగా కనిపించాలనే ఉంటుంది. టైప్‌కాస్ట్ అవ్వడం అసలు ఇష్టం లేదు. అందుకే ఇప్పుడు 'స్వయంభూ', 'నాగబంధం' వంటి వైవిధ్యమైన చిత్రాలతో మీ ముందుకు వస్తున్నాను'' అంటూ ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ''స్క్రీన్ పై ఎంత గ్లామర్‌గా కనిపించినా, ఇంట్లోనైతే ఓవర్‌సైజ్ టీషర్ట్, జీన్స్, నూట్ వేర్‌స్‌తో పూర్తిగా చిల్ మోడ్‌లోనే ఉంటాను. షూటింగ్ లేని రోజుల్లో మేకప్ అస్సలు వాడను. నా స్కిన్ కి రెస్ట్ ఇస్తాను. నా అందం వెనుక రహస్యం ఖరీదైన క్రీములు కాదు.. సరైన నిద్రపోవడం, ఎక్కువ నీరు తాగడమే! చాలామంది నన్ను ఔట్‌గోయింగ్ అనుకుంటారు కాని, నేను చాలా రిజర్వ్‌డ్ పర్సన్. నా ఫ్రెండ్ సర్కిల్ చాలా చిన్నది. ఇండస్ట్రీలో కూడా నమ్మిన వాళ్లతోనే ఎక్కువగా మెలుగుతాను. నా పర్సనల్ స్పేస్ నాకు చాలా విలువైనది. గాసిప్స్ వస్తుంటాయి, పోతుంటాయి. వాటిపై ఫోకస్ పెట్టను. నా పర్సనల్ లైఫ్ గురించి ఎక్కువగా మాట్లాడాలని అనిపించదు. కొంచెం మిస్టరీ ఉండటం కూడా మంచిదే కదా'' అంటూ బోల్డు కబుర్లు చెప్పుకొచ్చింది. దటీజ్ .. 'ఇస్మార్ట్' ఇమేజ్!

## అప్పుల్లో ఉన్నవారికి ధైర్యాన్నిచ్చే
# 'కార్మేని సెల్వం'

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



- దర్శకుడు రామ్ చక్రి

పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఈ నెల 3న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రామ్ చక్రి ఇలా ముచ్చటించారు. 'కార్మేని సెల్వం' సినిమా మధ్య తరగతి జీవితంపై ఆధారపడి ఉంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ కథతో కనెక్ట్ అవుతారు. ముఖ్యంగా అప్పుల సమస్యతో బాధపడుతున్న వారికి ఈ సినిమా ఒక ధైర్యాన్ని ఇస్తుంది. మధ్య తరగతి కుటుంబాల్లో అప్పులు అనేవి కామన్‌గా ఉంటాయి. వాటి కారణంగా కుటుంబంలోని సంబంధాలు, వారు తీసుకునే నిర్ణయాలు ఎలా ప్రభావితం చేస్తాయనేది ఇందులో చూపించబోతున్నాం. చాలా రియలిస్టిక్‌గా మూవీ ఉంటుంది. సముద్రఖని గారు ఆయన పాత్రలోని ప్రతి షేడ్‌ను అద్భుతంగా పండించారు. మధ్యతరగతి భర్తగా, తండ్రిగా తనదైన ఎమోషన్‌ను పండించారు. ఆయనతోపాటు గౌతమ్ మీనన్ గారు, లక్ష్మీ ప్రియా, అభినయ పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. మా టెక్నికల్ టీమ్ కూడా ఎంతో సపోర్ట్ చేసింది. మ్యూజిక్ విషయానికొస్తే.. ఈ సినిమా కోసం మేము ఒక కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తున్నాం . 'మ్యూజిక్ యాజ్ ఎ సర్వీస్' పేరుతో మా మ్యూజిక్ డైరెక్టర్ రామానుజన్ టీమ్ వర్క్ చేశారు. సంగీతం అనేది కేవలం మ్యూజిక్ డైరెక్టర్ లేదా సింగర్స్‌దే కాదు.. ఇన్‌స్ట్రుమెంటలిస్టులు, సౌండ్ ఇంజినీర్లు, మిక్సింగ్ టీమ్, ఇంకా ఎంతో మంది టెక్నీషియన్లు కలిసి చేసే పనిగా వారు భావించారు. ఈ కాన్సెప్ట్ ద్వారా ప్రతి పాటకు పని చేసిన అందరికీ క్రెడిట్ ఇవ్వడం, అలాగే రెవెన్యూ షేర్ చేయడం మా లక్ష్యం. ఇది మ్యూజిక్ వెనుక ఉన్న అసలు హీరోలకు గుర్తింపు ఇవ్వడానికి మా చిన్న ప్రయత్నం. మా డీఓపీ యువరాజ్ దక్షణ్, ఎడిటర్ జగన్‌లకు ఎంతో అనుభవం ఉంది. థియేటర్‌లో ఈ సినిమా విజువల్స్ చూస్తే, కథను ఎంత గ్రాండ్‌గా తీసుకెళ్లామో అర్థమవుతుంది. ఇక మా ప్రొడ్యూసర్ అరుణ్ రంగరాజులు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఈ కథపై నమ్మకం ఉంచి, మంచి క్వాలిటీతో సినిమా చేయడానికి మాకు సహకరించారు. ఈ సినిమా ద్వారా ఒక ముఖ్యమైన విషయం చెప్పాలనుకున్నా. కుటుంబంలోని పెద్దలు కొందరు విదేశాల్లో జీవనోపాధి కొనసాగిస్తున్నారు. కానీ వారి కుటుంబాలు ఇక్కడే ఉన్నాయి. ఏడాదికి కనీసం ఒకట్రెండు సార్లు అయినా వారు తిరిగి వచ్చి తమ కుటుంబాలతో కలవాలని నేను హృదయపూర్వకంగా కోరుకుంటున్నా. ప్రతి మిడిల్ క్లాస్ ఫ్యామిలీకు ఈ చిత్రం బాగా కనెక్ట్ అవుతుంది అన్నారు.

# కథకు బ్రిడ్జ్‌లా నా పాత్ర

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



మాళవిక నాయర్ ఇంటర్వ్యూ...

చార్మింగ్ స్టార్ శర్వా మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో రాజశేఖర్ పవర్ ఫుల్ పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక బ్యానర్ యూ.వి క్రియేషన్స్ నిర్మాణంలో భారతదేశపు మొట్టమొదటి కంప్లీట్ మోటోక్రాస్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ నెల 3న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక నాయర్ మీడియాతో సినిమా విశేషాలని పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

**బైకర్ జర్నీ ఎలా స్టార్ట్ అయింది?**
2024 ఏప్రిల్‌లో కథ విన్నాను. చాలా నచ్చింది. దర్శకుడు అభిలాష్ చాలా ఫ్రెష్ కంటెంట్ ఉన్న క్యారెక్టర్ రాశారు. బైకర్ ఇండియాలో ఫస్ట్ మోటోక్రాస్ ఫిల్మ్. ఈ సినిమా కోసం చాలా ఎక్సైటెగా ఉన్నాను. మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది. ఇందులో నా క్యారెక్టర్ గురించి ఎక్కువగా రివీల్ చేయకూడదు. ఇందులో నా పాత్ర కథకు బ్రిడ్జ్‌లా ఉంటుంది. ఒక స్పోర్ట్‌స్‌మన్ జీవితంలో ఫ్యామిలీ రోల్ చాలా కీలకం. ఇందులో వైఫ్ అండ్ హస్బెండ్ ఏ నిర్ణయం అయినా కలిసి తీసుకుంటారు. కథ మూడు టైమ్‌లైన్స్‌లో సాగుతుంది. నా పాత్ర కూడా ఇవాల్వ్ అవుతూ ఉంటుంది. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న మంచి ఇంపాక్ట్ ఫుల్ రోల్ చేశాను. రియల్ లైఫ్‌లో శర్వా.. నేను కూడా ఇంట్రోవర్ట్స్. పెద్దగా మాట్లాడుకోము. కానీ సినిమాలో క్యారెక్టర్ల పరంగా మంచి కెమిస్ట్రీ కుదిరింది. శర్వా చాలా స్పాంటేనియస్‌గా ఉంటారు. ప్రమోషన్స్ లో ఇంకా బాగా ఇంటరాక్ట్ అయ్యాం.

**బైకర్‌ను ఎఫ్ -1తో పోలుస్తున్నారు కదా?**
మోటోక్రాస్ స్పోర్ట్ ను షూట్ చేయడం చాలా కష్టం. మ్యూజిక్ టెక్నికల్‌గా ఖచ్చితంగా మంచి హై ఇస్తుంది. అలాగే ఇందులో మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉన్నాయి. ఫాదర్‌సన్ ఎమోషన్ ప్రత్యేకంగా ఉంటుంది. ఈ సినిమాలో ప్రతి పాత్రకు మంచి ఆర్క్ ఉంటుంది.

**ఇందులో డ్యాన్స్ నంబర్స్ ఉన్నాయా?**
ఇందులో "ప్రెట్టీ బేబీ" సాంగ్ ఉంది. శేఖర్ మాస్టర్ చాలా బ్యూటిఫుల్‌గా కొరియోగ్రఫీ చేశారు. ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు.

**రాజశేఖర్ తో మీకు సీన్స్ ఉన్నాయా?**
ఉన్నాయి. ఆయనతో కలిసి నటించడం మంచి అనుభవం. అంత సీనియర్ అయినప్పటికీ సెట్లో అందరితో చాలా క్లోజ్‌గా ఉంటారు. మనం ఏదైనా చెబితే వింటారు. అది చాలా గొప్ప గుణం. చాలా కైండ్ పర్సన్.

**మ్యూజిక్ గురించి చెప్పండి?**
ఈ సినిమాలో మ్యూజిక్ చాలా స్పెషల్‌గా ఉంటుంది. జిబ్రాన్ నేపథ్య సంగీతం అద్భుతంగా చేశారు. ప్రతి క్యారెక్టర్‌కు గుర్తుపెట్టుకునే సౌండ్‌ట్రాక్స్ కంపోజ్ చేశారు. మ్యూజిక్ పరంగా మంచి హై ఉంటుంది.

**డైరెక్టర్ అభిలాష్ రెడ్డి గురించి?**
అభిలాష్ చాలా క్లారిటీతో ఉండే డైరెక్టర్. కథకు, క్యారెక్టర్లకు ఏమి కావాలో ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాగే అనుకున్న సమయంలో షూటింగ్ పూర్తిచేస్తారు. ఆయన మంచి లీడర్. బైకర్ ఆయన గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది.

**మీరు సినిమాలు చాలా సెలెక్టివ్‌గా చేయడానికి కారణం?**
నాకు ప్రతి సారి కొత్త క్యారెక్టర్ చేయాలని ఉంటుంది. డిఫరెంట్ లేయర్స్ ఉన్న పాత్రలు చేయాలని అనుకుంటాను. అలాంటి పాత్రలు వస్తే ఖచ్చితంగా చేస్తాను.

**మీ కథల ఎంపిక ఎలా ఉంటుంది?**
ఒక క్యారెక్టర్ చేసే ముందు ఆడియన్స్ ను దృష్టిలో పెట్టుకుంటాను. మనం సినిమాలు చేస్తున్నదే వాళ్ల కోసం. అలాగే ఆ క్యారెక్టర్ నాకు పర్సనల్‌గా కనెక్ట్ అవుతుందా లేదా చూసుకుంటాను. ఖచ్చితంగా కొత్తగా అనిపిస్తే చేస్తాను. ఇప్పటివరకు నా జర్నీ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను.

**బైకర్ గురించి ఒక పదంలో చెప్పాలంటే?**
"థ్రిల్లింగ్." సినిమా చూసిన ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. అలాగే సినిమా మంచి స్ఫూర్తిని ఇస్తుంది. యంగ్, ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది.

- ఎం.డి అబ్దుల్

## తెలుగు కంటే మలయాళంలోనే
# ఎక్కువ ఆదాయం

ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

తెలుగులో సినిమాలు నిర్మించాలంటే మరింత జాగ్రత్తగా ఉండాలని అన్నారు ప్రముఖ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్. టొవినో థామస్ కొత్త సినిమా 'పళ్లిచట్టంబి'ని తెలుగులో రిలీజ్ చేస్తున్నారు బన్నీ వాస్. ఈ సినిమా ప్రెస్ మీట్ లో పాల్గొన్న బన్నీ వాస్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగులో విజయవంతమైన సినిమా ద్వారా నిర్మాతకు దక్కుతున్న థియేట్రికల్ రెవెన్యూ మలయాళంలో చూస్తే తక్కువగా ఉంటోందని ఆయన అన్నారు. మలయాళం థియేట్రికల్ రెవెన్యూతో అక్కడి నిర్మాతలు హ్యాపీగా ఉన్నారని ఆయన చెప్పారు. తెలుగులో థియేటర్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ బాగుండాలనే ప్రయత్నంలో భాగంగానే వీలైనన్ని ఇతర భాషల చిత్రాలను తెలుగులోకి తీసుకొస్తున్నట్లు బన్నీ వాస్ చెప్పారు. మనకు తెలిసిన వాళ్లు మలయాళంలో మూవీ ప్రొడ్యూస్ చేస్తున్నారంటూ డైరెక్టర్ మారుతి ఈ ప్రొడ్యూసర్స్ టీమ్ ను పరిచయం చేశారు. వాళ్లతో మాట్లాడిన తర్వాత ఒక ప్రెస్టీజియస్ మూవీ చేస్తున్నారని తెలిసింది. కొచ్చి తీసుకెళ్లి ఈ సినిమా చూపించారు. మన తెలుగు వాళ్లు కేరళ వెళ్లి ఇలాంటి ఒక భారీ చిత్రాన్ని నిర్మించడం ఆశ్చర్యాన్ని కలిగించింది. సినిమా టెక్నికల్ చాలా క్వాలిటీగా హ్యూజ్ గా ఉంటుంది. తెలుగు ఆడియెన్స్ కు ఒక కొత్త కమర్షియల్ మూవీ అవుతుంది. మలయాళం మూవీస్ అంటే మనం కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీస్ గాన భావిస్తాం కానీ పళ్లిచట్టంబి ఒక భారీ మంచి కమర్షియల్ మూవీ. తెలుగులో ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుంది. అయితే వెంటనే తెలుగు సినిమా చేయకండి. తెలుగులో సినిమా నిర్మించాలంటే చాలా కేర్ ఫుల్ గా ఉండాలి. మలయాళంలో చిత్ర నిర్మాణంలో ఉన్న కంఫర్ట్ తెలుగులో లేదు. సీనియర్ ప్రొడ్యూసర్ గా మీకు ఈ సలహా ఇస్తున్నా. ఎందుకంటే తెలుగులో ఓ సినిమా సక్సెస్ అయితే వచ్చే ఆదాయం కన్నా, మలయాళంలో ఒక మూవీ సక్సెస్ అయితే వచ్చే ఆదాయం ఎక్కువ. మలయాళంలో వచ్చినన్ని థియేట్రికల్ రెవెన్యూస్ మన తెలుగులో రావడం లేదు. మా దగ్గరకు పదేళ్ల క్రితం వచ్చి మాతో ట్రావెల్ అయిన మేఘశ్యామ్ ఈ సినిమాకు అసోసియేట్ ప్రొడ్యూసర్ గా వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. టొవినో గారు చేసిన 2018 చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేశాం. మంచి సక్సెస్ అయ్యింది. ఈ చిత్రంలో ఆయన పర్ ఫార్మెన్స్, ఫైట్స్ ఆకట్టుకుంటాయి. నాకు మోహన్ లాల్ గారిని చూసినట్లు అనిపించింది. కయదు లోహర్ కు రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలామంది అభిమానులు ఉన్నారు. డ్రాగన్, ఫంకీ సినిమాలతో మీరు తెలుగు ఆడియెన్స్ కు మరింత దగ్గరయ్యారు. పళ్లిచట్టంబి సినిమాతో తెలుగులో మీరు నెక్స్ రైజింగ్ స్టార్ అవుతారు. తెలుగులో మరింత మంచి పొజిషన్ కు చేరుకుంటారు. ఈ సినిమా చూసిన తర్వాత కయదుతో మరోసారి మీరంతా లవ్ లో పడతారు. ఈ సినిమా తర్వాత కయదుకు మరింతమంది ఫ్యాన్స్ పెరుగుతారు. డైరెక్టర్ ఈ మూవీని తీసిన విధానం, ఎడిటింగ్ చేయించిన విధానం బాగా నచ్చింది. ఒక న్యూ కమర్షియల్ మూవీ చూడాలంటే పళ్లిచట్టంబి థియేటర్స్ లో చూడండి. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అట్లీ దర్శకత్వంలో నటిస్తున్న సినిమా నుంచి టైటిల్, పోస్టర్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ రోజు సినిమాకు భాషా హద్దులు లేవు. తెలుగు సినిమా పాన్ వరల్డ్ సినిమా అయ్యింది. ఇక్కడికి వీలైనన్ని ఇతర భాషల చిత్రాలు తీసుకురావాలి. అప్పుడే డిస్ట్రిబ్యూషన్, థియేటర్స్ వ్యవస్థ బాగుంటుంది అని నాకు సాధ్యమైనన్ని మూవీస్ తెలుగులో రిలీజ్ చేస్తున్నా. ఈ సినిమాకు మాత్రం స్క్రీన్ ప్లే నాకు బాగా నచ్చింది అన్నారు.

# 'కిల్లర్' ఫస్ట్‌లుక్



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సినిమా 'కిల్లర్'. మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మంగళవారం హైదరాబాద్ లో 'కిల్లర్' సినిమా నుంచి హీరో, డైరెక్టర్ పూర్వాజ్ నటిస్తున్న డా.పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఆయన సీఎన్ఏ ఇంటిగ్రేషన్, రాయ్ ప్రోటోకాల్ కోసం వర్క్ చేసే సైంటిస్ట్ గా కనిపించబోతున్నారు. దర్శకుడిగా ఒక డిఫరెంట్ సైఫై థ్రిల్లర్ గా ఈ చిత్రాన్ని రూపొందిస్తూనే మరోవైపు మూవీలో ఒక ప్రధాన పాత్రలో నటిస్తున్నారు పూర్వాజ్. ఆయన దర్శకుడిగా, నటుడిగా ప్రేక్షకుల్ని మెప్పించబోతున్నారు.

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



హీరో టొవినో థామస్ - కయదు లోహర్

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పళ్లిచట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మంగళవారం జరిగిన ఇంటర్వ్యూలో హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్ మూవీ హైలైట్స్ తెలిపారు.

# బ్యూటిఫుల్ ఎమోషనల్..

**హీరో టొవినో థామస్ మాట్లాడుతూ...**
దర్శకుడు డిజో నాకు చాలాకాలంగా తెలుసు. మేమిద్దరం ఒక ప్రాజెక్ట్ చేయాలని అనుకుంటూ ఉండేవాళ్లం. డిజో పళ్లిచట్టంబి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైటింగ్ గా అనిపించింది. ఈ సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాం. ఆ తర్వాత నేను కమిట్ మూవీస్ ఫినిష్ చేశాను. డిజో కూడా జనగణమన సినిమాతో పాటు మరో మూవీ రూపొందించాడు. ఆ తర్వాత ఈ సినిమా వర్క్స్ ప్రారంభించాం. కొద్ది రోజుల తర్వాత ప్రొడ్యూసర్ మారారు. మేము వేరే ప్రొడ్యూసర్స్ ను ప్రాజెక్ట్ లోకి తీసుకున్నాం. పళ్లిచట్టంబిలో మతాల గురించిన ప్రస్తావన, ఏ మతాన్ని తక్కువ చేయడం కానీ చూపించలేదు. కథానుసారం చర్చి నేపథ్యంగా సన్నివేశాలుంటాయి. నేను తెలుగు తెలియకున్నా చిన్నప్పుడు ఎన్నో తెలుగు మూవీస్ ను చూసి ఎంజాయ్ చేశాను. పళ్లిచట్టంబి సినిమాకు సీక్వెల్ అనుకోవడం లేదు.

**హీరోయిన్ కయదు లోహర్ మాట్లాడుతూ...**
డ్రాగన్ మూవీ కంటే ఓకే అయిన చిత్రమిది. నేను నటించిన మలయాళ మూవీ పాథోన్‌పథం నూట్టండు చూసి దర్శకుడు డిజో ఈ మూవీ కోసం అప్రోచ్ అయ్యారు. ఈ కథ విన్నాక నా కెరీర్ లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందని అనిపించింది. ఇప్పటిదాకా నేను ఏ మూవీలో నటించని తరహా పాత్ర ఈ సినిమాలో చేశాను. ఈ చిత్రంలో రెబెకా అనే పాత్రలో కనిపిస్తాను. గ్లామర్ అనే కోణంలో ప్రేక్షకులు నా పాత్రను చూడరు. ఈ సినిమా నన్ను నాయికగా మరింత మంచి పొజిషన్ కు తీసుకెళ్తుందనే నమ్మకం ఉంది. నేను బయటకు మోడరన్ అమ్మాయిలా కనిపిస్తా కానీ రూరల్ అమ్మాయి మనస్తత్వమే నాలో ఉంటుంది. డైరెక్టర్ డిజో సపోర్ట్ తో రెబెకా పాత్రను సంతృప్తికరంగా పోషించగలిగాను. 'పళ్లిచట్టంబి' బ్యూటిఫుల్ ఎమోషనల్ ఫిలిం. ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ కలిసి చూడొచ్చు.


## 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'
# క్రేజీ టీజర్



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో అలరిస్తున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. హీరో రానా దగ్గుబాటి ఈ సినిమా తెలుగు టీజర్‌ను లాంచ్ చేశారు. "ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది... మనం ఇప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందని అంటున్నాడు" అనే వాయిస్‌తో ప్రారంభమైన టీజర్ క్రేజీగా ఆకట్టుకుంది. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనేది ఇంకా ఉంది... ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది' అనే డైలాగ్‌తో ప్రదీప్ రంగనాథన్ ఎంట్రీ, కృతి శెట్టిని వర్షంలో కలిసే సన్నివేశం ఇద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా కనిపించింది. ఎస్.జె. సూర్య ఎంట్రీ టీజర్‌కు మరో హైలెట్‌గా నిలిచింది. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అని ఆయన చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. దర్శకుడు విఘ్నేష్ శివన్ ఈ క్రేజీ లవ్ స్టోరీని ఫ్యూచరిస్టిక్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో డిజైన్ చేయడం, వరల్డ్ బిల్డింగ్ చాలా కొత్తగా అనిపించింది. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రవి వర్మన్ కెమెరా వర్క్ నెక్స్ట్ లెవల్‌లో ఉన్నాయి. మొత్తంగా టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది.

## వ్యాక్సిన్ డ్రైవ్‌కు మద్ధతుగా
# బన్నీ ఫ్యాన్స్!



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ హెచ్ పీవీ వ్యాక్సిన్ డ్రైవ్ కు మద్ధతుగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ఈ ఏడాది మొత్తం ప్రజల్లో హెచ్ పీవీ వ్యాక్సిన్ పై అవగాహన కార్యక్రమాలు చేయనుంది. ఏడాదికో మంచి పని చేయాలంటూ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చెప్పిన మాటల్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఇనిషేటివ్ తీసుకుంది. హెచ్ పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా మన ఆడ బిడ్డలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారు. 9 నుంచి 26 ఏళ్ల వయసున్న బాలికలు, మహిళలు ఈ వ్యాక్సిన్ ను ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ఉచితంగా తీసుకోవచ్చు. కేంద్రప్రభుత్వం స్వస్తి నారీ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా బాలికలకు, మహిళలకు ఉచితంగా హెచ్ పీవీ వ్యాక్సిన్ అందిస్తోంది. ఈనెల 8వ తేదీన అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి మంచి సామాజిక కార్యక్రమానికి ఫ్యాన్స్ అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయం.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027 Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**